




# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 25-09-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 15 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## శ్రీవారి సేవలో జగన్, యడియూరప్ప

### కర్ణాటక సత్రాలకు భూమిపూజ



తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం ఏపీ సీఎం జగన్, కర్ణాకట ముఖ్యమంత్రి యడియూరప్ప దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్న జగన్ మహాద్వారం వద్ద యడియూరప్పకు స్వాగతం పలికారు. రంగనాయక మండపంలో వేద పండితులు ఇరు రాష్ట్రాల సీఎంలకు ఆశీర్వచనం పలికారు. యడియూరప్పకు జగన్ శ్రీవారి శేషవస్త్రం బహుకరించారు. తితిదే ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఇద్దరు ముఖ్యమంత్రులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు సుందరకాండ పారాయణంలో పాల్గొన్నారు.

**కర్ణాటక సత్రాలకు భూమిపూజ**

శ్రీవారి దర్శనం కోసం కర్ణాటక నుంచి వచ్చే తిరుమల భక్తుల కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం సత్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించి తిరుమలలో జరిగిన భవన నిర్మాణ పూజా కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొన్నారు. కర్ణాటక సీఎం

తరువాయి 2లో..

## హనుమంతవాహనంపై శ్రీనివాసుడు



తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు ఉదయం స్వామివారు హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీమలయప్పస్వామివారు వేంకటాద్రిరాముని అలంకారంలో అనుగ్రహించారు. పండితుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగనాయకుల మండపంలో ఆస్థానాలను వేడుకగా నిర్వహించారు. ఈరోజు రాత్రి 7 నుంచి 8గంటల వరకు స్వామివారు సర్వభూపాల వాహనంపై దర్శనమివ్వనున్నారు.

## ఏపీ భూ సంస్కరణలపై కేబినెట్ సబ్‌కమిటీ భేటీ

### నెలరోజులపాటు స్పందన ఫిర్యాదులపై అధ్యయనం

### మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయం

### రెవెన్యూ సంబంధిత సమస్యలపై సుదీర్ఘ చర్చ



అమరావతి: రెవెన్యూ భూముల సంస్కరణల మంత్రి వర్గ ఉప సంఘం భేటీ గురువారం జరిగింది. డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, మంత్రులు కురసాల కన్నబాబు, అనిల్‌కుమార్ యాదవ్ సమావేశమయ్యారు. సీసీఎల్ఏ నీరబ్‌కుమార్, రెవెన్యూ కార్యదర్శి ఉషారాణి హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుత రెవెన్యూ సంబంధిత సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. భూ రికార్డుల ప్రక్షాళన చేస్తూ సమస్యలు తగ్గించేలా అందరికీ ఆమోదయోగ్యమైన సూచనలపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయ్యింది. ప్రజలకు సులభతరమైన రెవెన్యూ సేవలు, సమగ్ర సర్వే, పక్కాగా భూ రికార్డులు పరిశీలన,సూచనలు చేయడమే లక్ష్యంగా చర్చ సాగింది.

22ఏ కింద ఉన్న భూములపై అధ్యయనం చేయాలని కమిటీ నిర్ణయించింది. ఎస్టేట్, ఇనాం భూములపై సుదీర్ఘంగా చర్చించారు. వ్యవసాయ భూములను అతి తక్కువగా నామినల్ రుసుము చెల్లించి కన్వెర్ట్ చేసి రూ.కోట్లు ఆర్జిస్తున్నారనే అంశంపై సమీక్ష నిర్వహించారు. ఫ్రీడం ఫైటర్స్, మాజీ సైనికులకు ఇచ్చిన భూముల ఫిర్యాదుల పట్ల సమగ్ర విచారణ చేసి తగిన న్యాయం చేయాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. క్షేత్ర స్థాయి సమస్యలు తెలుసుకునేందుకు నెల రోజులపాటు స్పందన ఫిర్యాదులను అధ్యయనం చేయాలని మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయించింది.

## అంతర్వేది రథం ఘటనలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి

### వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు



అమరావతి: కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్న బాబు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమిత్‌షా, సీఎం జగన్ కలయిక వెనుక ఇష్టానుసారంగా ఎల్లో మీడియా రాతలు రాస్తోందని ఆయన మండిపడ్డారు. పిచ్చిరాతలతో ఎల్లో మీడియా ప్రజలను పక్కదారి పట్టిస్తోందని ధ్వజమెత్తారు. “చంద్రబాబు తన హయాంలో ఆలయాలు కూలగొట్టించలేదా?. అప్పుడు ఆయనకు హిందుత్వం గుర్తుకురాలేదా?” అని నిలదీశారు. అంతర్వేది రథం ఘటనలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి సీబీఐ విచారణకు ఆదేశించిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా బురదజల్లేందుకే ప్రతిపక్షాలు సమయం కేటాయిస్తున్నాయని మంత్రి కన్నబాబు దుయ్యబట్టారు.

రైతులు కష్టాలు పడకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని కన్నబాబు పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ ధరల్లో తెలంగాణతో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు రూ.80 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ పంట కొనుగోళ్లను టన్నుకు రూ.11 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. పెదవేగి ఫ్యాక్టరీకి తరలించే రైతులకు ఈ ధరల చెల్లింపు

తరువాయి 2లో..


## ఎస్పీ బాలుకి తీవ్ర అస్వస్థత



చెన్నై: ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఇటీవల కరోనా బారిన పడిన ఆయన కోలుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఇతర ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కాసేపట్లో బాలు ఆరోగ్య పరిస్థితిపై ఎంజీఎం ఆస్పత్రి వర్గాలు ప్రకటన విడుదల చేయనున్నాయి.కరోనా వైరస్ సోకడంతో ఆగస్టు 5న బాల సుబ్రహ్మణ్యం చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వైద్యులు వెంటిలేటర్, ఎక్మో సాయంతో చికిత్స ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఎస్పీబీ త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇటీవల ఆయనకు కరోనా నెగెటివ్ అని తేలడంతో అందరూ సంతోషం వ్యక్తంచేశారు. బాలు త్వరగా కోలుకొని క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. ఇటీవల ఆయన తనయుడు ఎస్పీ చరణ్ మాట్లాడుతూ.. ఎక్మో/వెంటిలేటర్ సాయంతో తన తండ్రికి చికిత్స కొనసాగుతోందని చెప్పారు. వైద్యులు ఫిజియో థెరపీ చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఆయన ఆహారంగా ద్రవ పదార్థాలు తీసుకుంటున్నారని, ఆస్పత్రి నుంచి సాధ్యమైనంత త్వరగా ఇంటికి వెళ్లాలన్న ఆసక్తితో ఉన్నారంటూ చరణ్ ట్విటర్‌లో పేర్కొన్నారు. తాజాగా ఆయన ఆరోగ్యంపై వస్తున్న వార్తలతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

## సచివాలయం ద్వారా ప్రజలకు 550 రకాల సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్



విశాఖపట్నం : ప్రజలకు అవసరమైన సేవలన్నీ సచివాలయం ద్వారా అందించాలని జిల్లా కలక్టరు వి. వినయ్ చంద్ తెలిపారు. గురువారం పెందుర్తి మండలం సరిపల్లి గ్రామం, సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం గ్రామాల్లోని సచివాలయాలను ఆయన సందర్శించారు. సచివాలయం ద్వారా 550 రకాల సేవలు అందించేందుకు ఉద్యోగులు మరింత చురుకుగా పనిచేయాలని ఆయన సూచించారు. నూతనంగా నిర్మించనున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్ స్థలాలను పరిశీలించి, పనులను సత్వరమే ప్రారంభించి పూర్తిగావించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు వారి పరిధిలోని ప్రజలకు అవసరమైన సేవలన్నీ వారే అందించాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చే స్పందన వినతులను సచివాలయం స్థాయిలోనే పరిష్కరించాలని, అక్కడ పరిష్కరించుటకు వీలుకాని సమస్యలను మాత్రమే పై స్థాయికి పంపించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమీషనర్లు, ఐ.టి.డి.ఎ. పరిధిలో ప్రాజెక్టు అధికారి మరియు సబ్ కలెక్టరు, రెవిన్యూ డివిజనల్ అధికారి పరిధిలో ఆర్డిఓ ప్రతివారం 2 మండలాలలో పర్యటించి సచివాలయాలల్లోని మౌళిక వసతులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం సబ్బవరం మండలం

తరువాయి 2లో..

## పోలవరానికి నిధులివ్వండి

### ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఢిల్లీ: రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించినట్టు ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కేంద్రమంత్రిని కలిసిన అనంతరం బుగ్గన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, కేంద్ర సహకారం కోరామన్నారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్రానికి నిధులు విడుదల వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. ఏపీ విభజన చట్టంలోని అంశాలు, రామాయపట్నం పోర్టు, పారిశ్రామిక రాయితీలు, ప్రత్యేక హెూదా అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. జీఎస్టీ బకాయిల అంశంలో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చిన ఆప్షన్లపై చర్చించాల్సి ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 760 కోట్ల రూపాయల బిల్లులు పునః పరిశీలన చేయాలని కోరామని చెప్పారు. బుగ్గనతో పాటు ఎంపీలు కోటగిరి శ్రీధర్, లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.




# అంతర్వేది రథం ఘటనలో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి

మొదటి పేజీ తరువాయి

చేస్తామన్నారు. ఆయిల్ ఫామ్‌కు మద్దతు ధర ప్రకటించాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. మార్కెటింగ్ వ్యవస్థను రైతులకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వివిధ వాణిజ్య పంటలను ప్రాసెసింగ్ చేయడం ద్వారా రైతులకు మరింత లబ్ధి చేకూర్చేందుకు నిర్ణయించామన్నారు. త్వరలో ఆహారశుద్ధి పాలసీని ప్రకటిస్తామని వెల్లడించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలోకి తెస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వమే సొంతంగా ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆలోచన చేస్తోందని మంత్రి కన్నబాబు వెల్లడించారు.

# సజావుగా సచివాలయ పరీక్షలు

## జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : గ్రామ/వార్డు సచివాలయ పరీక్షలు సజావుగా జరిగాయని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. బుధవారం, ఉదయం, గ్రామ వ్యవసాయ సహాయకులు (గ్రేడ్-2) (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ) పోస్టునకు పరీక్షలు జరిగాయి.

జిల్లాలో అయిదు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందని, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం స్కూల్, గీతాంజలి స్కూల్, భాష్యం హై స్కూల్, చైతన్య హై స్కూల్, ఎం.వి.ఎస్. డిగ్రీ కాలేజీలలో ఈ పరీక్షలు జరిగాయని చెప్పారు.

మొత్తం 702 మంది అభ్యర్ధులకు గాను 508 మంది అభ్యర్ధులు హాజరైనారని, 194 మంది అభ్యర్ధులు గైర్హాజరైనారని 72 శాతం అభ్యర్ధులు హాజరైనట్లు తెలిపారు. కరోనా పాజిటివ్ పేషెంట్లు ఎవ్వరూ హాజరు కాలేదని చెప్పారు.



*విశాఖపట్నం లో జి.వి.యం.సి. గాంధీ విగ్రహం దగ్గర బీజేపీ నగర అధ్యక్షులు నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నా లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎల్.సి. మాధవ్, పెద్దలు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు ప్రకాష్ రెడ్డి , కెవిరమణ బిజెపి కిసాన్ స్టేట్ సెక్రటరీ, వివిధ నగర, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చా ల రాష్ట్ర, నగర నాయకులు హాజరై కొడాలి నాని బర్తరఫ్ చేయాలని, అలాగే తక్షణమే హిందువులు కు క్షమాపణ చెప్పాలని, పెద్దలు నరేంద్ర మోడీ, యోగి ఆదిత్య నాథ్ గురుంచి తప్పుడు మాట్లాడినందుకు వెంటనే మంత్రి పదవినుంచి తొలగించాలని నినాదాలతో డిమాండ్ చేశారు.*

# వివేకా హత్యకేసు కొనసాగుతున్న సీబీఐ విచారణ

కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో కీలక అనుమానితులను సీబీఐ విచారిస్తోంది. కడప జిల్లా పులివెందులకు చెందిన మున్నా, అతని కుటుంబసభ్యులను గత నాలుగు రోజుల నుంచి విచారిస్తున్న సీబీఐ అధికారులు ఇవాళ కూడా కడప కేంద్ర కారాగారంలోని అతిథి గృహంలో మరోసారి ప్రశ్నిస్తున్నారు. పులివెందులలో చెప్పుల దుకాణం నిర్వహించే మున్నాకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు లాకర్‌లో రూ.48లక్షల నగదు, 25 తులాల బంగారం ఉన్నట్లు సీబీఐ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే.

చెప్పుల దుకాణం యజమానికి అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై అధికారులు ఆరాతీస్తున్నారు. మున్నాతో సంబంధం ఉన్న మరికొందరు యువకులను కూడా సీబీఐ అధికారులు విచారణకు పిలిచారు. కడపలోనే కాకుండా పులివెందులలో కూడా సీబీఐ విచారణ కొనసాగిస్తోంది. పులివెందుల ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఓ బృందం మున్నా స్నేహితులు, సన్నిహితులను విచారిస్తున్నట్లు సమాచారం.

# సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన శ్రీనివాస్




తిరుపతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టీటీడీ మాజీ చైర్మన్ ఆదికేశవులు నాయుడు కుమారుడు శ్రీనివాస్ కలిశారు. గురువారం ఉదయం శ్రీ పద్మావతి అతిథి గృహంలో ముఖ్యమంత్రితో ఆయన భేటీ అయ్యారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన తండ్రి హయాంలో ప్రారంభించిన 'ఆనంద నిలయం అనంత స్వర్ణమయం' ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. మధ్యలో ఆగిపోయిన ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి సీఎం జగన్ హామీ ఇచ్చారు. నాన్నగారు టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ప్రారంభించారు. అయితే కోర్టు కారణాలు, రాజకీయాల వల్ల ఆగిపోయింది. ఆనంద నిలయం అనంత స్వర్ణమయం ప్రాజెక్ట్‌కు వివిధ ప్రాంతాల నుంచి దాతలు 150 కిలోల బంగారం విరాళంగా ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని నాన్నగారి చివరి కోరికను నెరవేర్చాలని ముఖ్యమంత్రిని కోరారు' అని తెలిపారు. కాగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి టీటీడీ చైర్మన్ ఆదికేశవులు నాయుడు ఆనంద నిలయం అనంత స్వర్ణ మయం ప్రాజెక్టును ప్రారంభించారు. శ్రీవారి ఆలయం మొత్తం పూర్తిగా బంగారు రేకులతో తాపడం చేయించాలని ఆదికేశవులు నాయుడు నిర్ణయించిన విషయం విదితమే.

మొదటి పేజీ తరువాయి

# శ్రీవారి సేవలో జగన్, యడియూరప్ప




యడియూరప్పతో కలిసి ఆయన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో కర్ణాటక ప్రభుత్వం వసతి గృహ సముదాయాలు నిర్వహించనుంది. రోజుకు 1800 మంది బస చేసేందుకు వీలుగా నిర్మాణాలు చేపట్టనున్నారు.







## సచివాలయం ద్వారా ప్రజలకు 550 రకాల సేవలు అందించాలి

మల్లునాయుడుపాలెం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ సచివాలయ సిబ్బందితో సమావేశమై ప్రతీ రోజు ఉదయం గ్రామాన్ని శుభ్రం చేస్తున్న పారిశుద్య కార్మికులు ఏ విధంగా చేస్తున్నదీ పరిశీలించాలన్నారు. శుభ్రతలో ఏమైనా లోపాలు ఉంటే కార్మికులకు చెప్పాలని ఆదేశించారు. సచివాలయం ద్వారా 550 రకాల సర్వీసులు ప్రజలకు అందించాల్సి ఉందని, వాటిని దృష్టిలో పెట్టుకొని చురుకుగా పనిచేయాలన్నారు. అక్కడ అదనంగా నిర్మిస్తున్న సచివాలయం గదులను ఆయన సందర్శించిపరిశీలించారు. నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ప్రోజెక్టు డైరెక్టరు రఘురామాచారి, ఆర్.డబ్ల్యు.ఎస్. ఇ.ఇ. రామారావు, పెందుర్తి, సబ్బవరం మండలాల తహసిల్ధార్లు, మండల అభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాకు జీవనోపాధి కల్పించండి

## సెక్స్ వర్కర్స్ వేడుకోలు



విశాఖపట్నం : కోవిడ్-19 మహమ్మారి వల్ల విశాఖపట్నం, గుంటూరు జిల్లాలోని వివిధ వ్యభిచార గృహాలలో మ్రగ్గుతున్న మహిళలు (సెక్స్ వర్కర్స్) లలో 75 శాతం మంది రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు అందిస్తే తాము శాశ్వితంగా వ్యభిచార కూపం నుంచి బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నరని రాష్ట్ర సెక్స్ వర్కర్స్ ఫోరం ఉత్తరాంధ్ర విముక్తి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపం చేసుకొంది. కోవిడ్ లా క్డౌన్ వల్ల మార్చి నెల నుంచి తమ ఉపాది అవకాశాలు కోల్పోయామని తమ వద్దకు కస్టమర్లు రాకపోవడంతో తమ కుటుంబాలు పోషించుకునే స్తోమత లేకపోవడంతో తమ ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే వుండటం, అలాగే ఇతర ప్రత్యామ్నయ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో తమ మనుగడ కోసం పూర్తిగా అధిక వడ్డీలతో రుణాలు తీసుకుంటూ జీవనం గడుపుతూ రావడంతో సెక్స్ వర్కర్స్ వ్యభిచార వృత్తి ని పూర్తిగా వదిలివేసి ఇతర ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చేపట్టడానికి మానసికంగా సిద్ధంగా ఉన్నారు.

సెక్స్ వర్కర్ల సంక్షేమం కోసం రాష్ట్రం లో పనిచేస్తున్న ఇటీవల ధరణిసంస్థ,, హెల్ప్ సంస్థ, రాష్ట్ర సెక్స్ వర్కర్స్ ఫోరం ,విముక్తి , సంయుక్తంగా విశాఖపట్నం, గుంటూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని వ్యభిచారంలో మ్రగుతున్న 230 సెక్స్ వర్కర్ల కుటుంబాలతో ఇటీవల్ ఒక శాంపిల్ సర్వే చేపట్టడం జరిగింది. ఈ సర్వేలో దాదాపుగా 80 శాతం సెక్స్ వర్కర్లు తాము ఈ వృత్తిని వదిలి తిరిగి సమాజంలోకి వస్తామని అయితే తమకు తగిన ప్రత్యామ్యాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరడం జరిగింది. వీరిలో షుమారు 70% సెక్స్ వర్కర్లు తమకు ఆదాయం వచ్చే మరో దారి లేక తాము, తమ బ్రోతల్ ఓనర్స్, వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీ రేట్లకు 5 శాతం నుంచి 15 శాతం వరకు వడ్డీకి రుణాలు తీసుకున్నామని ఫలితంగా వారి వేధింపులు కూడా భరించాల్సి వస్తోందని ఆందోళనలతో కూడిన ఆవేదనతో ఈ సర్వే లో వెల్లడించారు.

వీరిలో సుమారు 60 శాతం మంది కరోనా మహమ్మారి ముందు నుంచే తాము వ్యభిచారం వల్ల వచ్చే ఆదాయం తమ కుటుంబ పోషణ, ఆర్థిక అవసరాలకు సరిపోవడం లేదని.....అలాగే మరో ఆసరా, ప్రత్యామ్నాయం లేకనే కష్టమో, నష్టమో ఈ వ్యబిచారంలో మ్రగ్గవల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

ఈ సర్వే లో పాల్గొన్న వారిలో 85 శాతం మంది 25 నుంచి 45 సంవత్సరాల వయసులో ఉన్నవారు ఉన్నారు. మీరు అనేక సామాజిక,ఆర్థికకారణాలు, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు అందుబాటులో లేకపోవడం వల్లనే ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. అయితే వీరిలో ఎక్కువమంది బలవంతంగా ప్రలోభాల వల్ల మోసపోయి తమ 18 సంవత్సరాల వయసు లోనే ఈ వృత్తిలోకి దింపబడ్డారు.

చదువు లేకపోవడం,దారిద్ర్యం, పేదరికం వల్ల మేము మోసపోయి వ్యభిచారంలోకి నెట్టబడి, ఇతర అవకాశాలు ఉద్యోగ ఉపాది చేపట్టే తగిన నైపుణ్యాలు లేక ఈ ఊబిలోనే కొనసాగుతున్నామని, అయితే గత 7 నెలల కాలంలో మేము ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా మా పిల్లలు, కుటుంబం భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని మేము ఇప్పుడు ఇతర ప్రత్యామ్నాయ జీవనోపాదుల కోరుకుంటూ ఈ వ్యభిచార కూపం నుంచి బయటకు రావాలని కోరుకుంటున్నాము అని పలువురు సెక్సవర్కర్లు కన్నీళ్లతో వేడుకుంటున్నారని విముక్తి రాష్ట్ర కన్వీనర్ హసీనా, ILFAT (India Leaders Forum Against Trafficking) రాష్ట్ర నాయకురాలు మున్నేసా , ధరణి సంస్థ ప్రతినిధి బి. హరి తెలిపారు.

ఈ సర్వే లో పాల్గొన్న వీరిలో 90 శాతం మంది తిరిగి ఈ వృత్తిలో కొనసాగడానికి ఇష్టపడటం లేదు. అయితే దారిద్ర్యం, అప్పులు, ఆకలి, భయం అలాగే అప్పుల వాళ్ళ బ్రోతల్ ఓనర్ల ఒత్తిడి గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నారు. వీరిలో దాదాపుగా పది శాతం మంది మరో రెండు ,మూడు నెలలు పోతే తిరిగి వ్యభిచారం పుంజుకుంటుందని నమ్ముతుండగా 90 శాతం మంది ప్రభుత్వం తమను ఆదుకుని ఉపాది అవకాశం కల్పిస్తే తాము శాశ్వతంగా ఈ వృత్తిని వదిలేసి ప్రత్యామ్నాయ జీవనోపాదులు చేపడతామని అంటున్నారు.

హెల్ప్ సంస్థ రాష్ట కోర్దినటార్ శ్రీ భాస్కర్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి పుణ్యమా అని వ్యభిచారంలో మ్రగ్గుతున్న మహిళలు నేడు పునరావాసం కోరుకుంటున్నారని కాబట్టి కేంద్ర రాష్ట్ర ,ప్రభుత్వాలు తక్షణమే వారికి వేశ్య వృత్తి లోని మహిళలు,అలాగే అక్రమ రవాణా బాధిత మహిళల పునరావాసం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక నిధి నుంచి వీరికి సహాయం అందించి వారికి ఇప్పటివరకు ఉన్న అధిక వడ్డీ రుణాలు చెల్లించుకొనేలా చేసి మరో కొత్త జీవితం ప్రారంభం కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

బాధిత మహిళల ప్రతినిధులు మాట్లాడుతూ కరోనా మహమ్మారి వల్ల ఎంతో మంది సెక్స్ వర్కర్లు జీవనోపాధి కోల్పోయారని వారిని ఆదుకోవాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసినందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బాధితుల మహిళలకు పునరావాసం నిధి నుంచి సహాయం అందించి వ్యభిచారంలో ఉన్న బాధిత మహిళలకు ప్రత్యమ్నాయ జీవనోపాదులు చేపట్టేలా చూడాలని కోరారు.

ఈ విషయమై పలు సంస్థలు ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచే రాష్ట్ర స్థాయి అధికారులను స్వయంగా కలసి వినతిపత్రాలు అందించామని కానీ మా కన్నీళ్ళు వాళ్ళను కరిగించ లేక పోయాయి అని అంటూ మేము రెండు రోజుల్లో స్థానిక శాసన సభ్యులు, మంత్రులను కూడా కలిసి బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూడమని కోరుతున్నారు.

# యువతలో సేవాభావానికి ఎన్ఎస్ఎస్ కీలక భూమిక

*గీతం ఎన్ఎస్ఎస్ వార్షికోత్సవం వైస్ ఛాన్సలర్ కె.శివరామకృష్ణ*




సాగర్‌నగర్ : ఐదు దశాబ్ధాల క్రిందట దేశంలో ప్రారంభం అయిన జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) యువతను సమాజ సేవకులుగా చైతన్య పరచడంలో కీలక భూమిక వహిస్తోందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం తేది: 24-09-2020న జరిగిన 51 ఏళ్ళ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. గీతంలో 19 ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా 2500 మంది వలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. గాంధీ మహాత్ముని మార్గంలో ప్రయాణాన్ని కొనసాగించడంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భవించిందన్నారు. మన చుట్టూ ఉండే ప్రజల సమూహమే సమాజమని, ప్రజల ఎదుర్కొనే చిన్న సమస్యలపై స్పందించి సహాయపడగలగడం సామాజిక భాధ్యత అన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలలో కరోన పై చైతన్య కార్యక్రమాలను వలంటీర్లు నిర్వహించడాన్ని ఆయన అభినందించారు.

కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకుడు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి ఎమ్.ఎస్.ప్రకాశ్‌రావు హజరై వలంటీర్లకు దిశ నిర్ధేశం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సంఖ్యను రానున్న కాలంలో రెండింతలుగా పెంచుతామని సమీప గ్రామాలను, ప్రభుత్వ పాఠశాలలను దత్తత స్వీకరించి పోషకాహార లోపాలను అధిగమించడం, వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్, గ్రామీణ అభివృద్ధికి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. జిమ్‌సర్ ఆసుపత్రి వైద్య కళాశాల వైద్య నిపుణులు డాక్టర్ నిఖిల, డాక్టర్ రమణరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

# కాలుష్య నివారణకు కృషి చేయండి

విశాఖపట్నం : కాలుష్యం పర్యావరణాన్ని మాత్రమే కాకుండా, సంస్కృతి, సమాజం, ఆర్థిక వ్యవస్థను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తోందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్, నేషనల్ అపెక్స్ బాడీ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ అధ్యక్షుడు ప్రణబ్ సర్కార్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని (సెప్టెంబర్ 27) పురస్కరించుకొని ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్యాకేజింగ్ వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ ద్వారా పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాలుష్య నివారణకు కృషి చేయడం ఎంతో అవసరమన్నారు. పర్యాటకంలో కాలుష్యం అనేది వాయు ఉద్గారాలు, శబ్దం, ఘన వ్యర్థాలు, చెత్తాచెదారం, మురుగునీటి విడుదల, రసాయనాలు తదితర కలిగి ఉంటుందని వివరించారు. నెల క్రితం భారత ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్ (శుభ్రత సర్వే) ను విడుదల చేసిందన్నారు. ఇందులో అమృత్ సర్, జైపూర్, ఢిల్లీ, ముంబై, శ్రీనగర్, వారణాసి, షిల్లాంగ్ తదితర అనేక పర్యాటక హాట్‌స్పాట్‌లకు పేలవమైన రేటింగ్ లభించిందని పేర్కొన్నారు. ప్రపంచంలోని 50 అత్యంత కలుషితమైన నగరాల్లో సగం భారతదేశంలో ఉండటం అత్యంత బాధాకరమన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా భారతదేశం/భారతీయ గమ్యస్థానాల ప్రతికూల చిత్రాన్ని ప్రదర్శిస్తోందని తెలిపారు. శుభ్రమైన, సురక్షితమైన, పర్యావరణ అనుకూల పర్యాటక పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఇప్పుడు రోడ్‌మ్యాప్‌పై పునరాలోచించడానికి ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు.



*జోన్- 3 లో 19వ వార్డులో స్వచ్ఛసర్వేక్షన్ సదస్సులో వార్డు వర్కర్స్ కి అవగాహన సదస్సులో తడిచెత్త-పొడిచెత్త మరియు మస్తార్, ఓడబ్ల్యూఎంఎస్ స్కానింగ్ గురించి స్వీపింగ్ మరియు కాలువలు రోడ్డు స్వీపింగ్ గెడ్డలు శుభ్రం చేసుకోమని దాని పై వర్కర్స్ కి అవగాహన సదస్సు పై వార్డు పర్యటన ఏర్పాటు చేయడం జరిగింది. అందులో పాల్గున్న వారు : జోన్.3 జోనల్ కమీషనర్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, శానిటరీ మైస్త్రి సీర అప్పలరాజు వార్డు శానిటరీ సెక్రటరీ లు సిబ్బంది పాల్గొన్నారు.*

# బాల గణపతి ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

*అధ్యక్షులుగా వడ్డాది దుర్గాప్రసాద్ ఏకగ్రీవం*



చోడవరం : చోడవరం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోగల బాల గణపతి ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది.

ఈ ఎన్నికల్లో వడ్డాది దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికకాగా, ఉపాధ్యక్షులుగా చిమ్మిటీ గణేష్, కార్యదర్శిగా బండి నూకరాజు, సహాయ కార్యదర్శి గా వాకాడ వరప్రసాద్, కోశాధికారిగా సూరారపు గోవిందా, డైరెక్టర్ గా బంగారి దుర్గారావు, మంగ పవన్ కుమార్, అల్లు వంశీకృష్ణ, కంచర్ల సూర్య భాస్కర్, సూరారపు నాగ చంద్ర ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులు అభినందించారు.

# పట్టాసి ఫౌండేషన్ దాతలు ద్వారా చిన్నారులకు బట్టలు పంపిణీ



పాడేరు : అరకులోయ మండల కేంద్రంలో గల సరభగుడలో రోజు,రోజుకూ కరోనా మహమ్మారి మరియు మలేరియా టైపాయిడ్ జ్వరాలు విజృంభిస్తుండడంతో అరకులోయ పట్టాసి ఫౌండేషన్ వారు శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గన్నెల గ్రామంలో 100 మంది నిరుపేద చిన్నారులకు వైయస్సార్ సీపీ నాయకురాలు పట్టాసి దీనవల్లి ఆధ్వర్యంలో కొత్త బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు చలపతిరావు, జగ్జివన్‌రావు, రూతు అమ్మ బుజ్జి, మాధవి, రవి ప్రకాష్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మంత్రి 'కొడాలి' పై 'కదిరి' ఫిర్యాదు



విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగ దారుల వ్యవహారాల శా ఖా మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వర రావుఏనాని పై ఎంవిపి కాలనీ జోన్ పోలీస్ స్టేషన్ లో, విశాఖపట్నం జీవీఎంసీ 19 వ వార్డు పాత 17 వ వార్డు బిజెపి అధ్యక్షుడు, న్యాయవాది కదిరి రాము ఫిర్యాదు దాఖలు చేశారు. హిందూ దేవతా మూర్తుల పైన, దేవాలయ ఆస్తుల పైన భౌతిక దాడుల విషయంలోనూ, హిందూ మత విశ్వాసాలను హేళన చేస్తూ కించపరుస్తూ వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో మత సామరస్యం అడుగంటే రీతిలో కొడాలి నాని అనుచిత వ్యాఖ్యలు చేశారని కదిరి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకవైపు నేరస్తులను వెనకేసుకు వస్తూ, నేర సంఘటనలను సమర్థిస్తూ మరోవైపు హిందూమత ధర్మ వారసత్వాన్ని, అస్తిత్వాన్ని, విశ్వాసాలను కించపరుస్తూ, బాధ్యతాయుత ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రజల శాంతి భద్రతలను గాలికి వదిలి విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా పరుష వ్యాఖ్యలు చేయడం ద్వారా చట్టాన్ని కొడాలి నాని తన చేతుల్లోకి తీసుకొని, రాజ్యాంగేతర శక్తిగా నిబంధనలను ఉల్లంఘించి నేరానికి పాల్పడ్డారని తెలిపారు. కొడాలి నాని పై తక్షణమే కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, శిక్షించి, న్యాయం చేయాలని కదిరి ఫిర్యాదులో కోరారు.

# రూరల్ వాటర్ సప్లైయ్ కార్మికులు

## కలెక్టరేట్ వద్ద ఆందోళన



విశాఖపట్నం : గ్రామీణ త్రాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యుఎస్)లో పనిచేస్తున్న వాల్ & పంప్ ఆపరేటర్స్, వాచ్‌మెన్స్, ఎలక్ట్రిషన్లు, పారిశుద్య విభాగంలోని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, 8 నెలల బకాయిి జీతాలు విడుదల చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నేడు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించడమైనది. రూరల్ వాటర్ సప్లైయ్ (ఆర్.డబ్ల్యు.ఎస్) పరిధిలో వివిధ వాటర్ స్కీమ్స్‌లో గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీరు సరఫరా విభాగంలో పనిచేస్తున్న మాకు 8 నెలలుగా జీతాలు పెండింగ్ పెట్టారని, కాంట్రాక్టర్లు కార్మికులకు కనీసవేతనాలు, పి.ఎఫ్., ఇఎస్.ఐ అమలు చేయడం లేదు. జిల్లాలో సుమారు 34 స్కీంల పరిధిలో సుమారు 250 మందికిపైగా కాంట్రాక్టు వర్కర్లుగా పనిచేసున్న మాకు కనిష్టంగా రూ.2500/-లు, గరిష్టంగా రూ.7,000/-లు మాత్రమే జీతం ఇస్తున్నారు. ఈ జీతాలు కూడా అనేక స్కీంల పరిధిలో 8 నెలల వరకు బకాయి ఉన్నాయి. అరకొర జీతాలు, అవికూడా 7,8 నెలల బకాయి పెట్టడడంతో ఎమితిని బ్రతకాలని నినదించారు. జిల్లాలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా ఒక్కో స్కీంలో ఒక్కోలా జీతాలు చెల్లిస్తున్నారు. కాంట్రాక్టర్లు టెండర్లలో జీతాలు ఒక్కొక్కరికి రూ.12,000/-ల నుండి రూ.15,000/-ల వరకు చెల్లిస్తున్నట్లు అనేకచోట్ల ఎం.బుక్స్‌లో కూడా నమోదు చేస్తూ మాకు మాత్రం జీతాలు తక్కువగానే చెల్లిస్తున్నారు. దీనిపై పర్యవేక్షించాల్సిన జిల్లా పరిషత్ మరియు నీటిపారుదల శాఖ ఎస్.ఇ.గారు కనీసం పట్టించుకోవడం లేదు. క్రింది స్థాయి అధికార్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై మా జీవితాలతో ఆడుకుంటున్నారు. ఎక్కడైనా ప్రశ్నిస్తే మమ్మల్ని తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లుకానీ, గుర్తింపు కార్డులు,లేకుండా రోజుకు 12 నుండి 15 గంటలు పనిచేయిస్తున్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా అత్యవసర విభాగం కాబట్టి రేయింబవళ్లు కూడా పనిచేస్తు వస్తున్నాము. కానీ మాకు ఎటువంటి హక్కులు, చట్టాలు అమలు కావడం లేదు. మాకు ఉద్యోగ భద్రత లేదు. కాంట్రాక్టు వర్కర్స్‌ను పర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం హామీమేరకు మమ్మల్ని రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకురావాలని కోరుతున్నాము. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు, జెడ్.పి. సిఇఒ లకు మెమోరాండం ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి వి.వి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ సంఘం నాయకులు ఎం.త్రినాధరావు, యు.రమణ, వి.జట్లినాయుడు, సూర్యనారాయణ, శ్రీను తదితరులు నాయకత్వం వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోవిడ్‌పై అవగాహన కల్పనలో ఎన్ఎస్ఎస్ భాగం కావాలి

***- అవగాహనతో కోవిడ్‌ను అరికట్టాలి - వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి***



**పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి**

ఆంధ్రాయూనివర్శిటీ : కోవిడ్‌పై అవగాహన కల్పించడంలో జాతీయ సేవ పథకం వలంటీర్లు భాగం కావాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో యూనిసెఫ్ (హైదరాబాద్) మంజూరు చేసిన నూతన ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ సంపూర్ణ అవగాహనతో కోవిడ్‌ను అరికట్టాలని సూచించారు. యూనిసెఫ్ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని వివిధ వర్గాల ప్రజలకు కోవిడ్‌పై విస్తృత అవగాహన కల్పించనున్నారు. కళాశాలతో సమన్వయం చేస్తూ సమాజంలో అన్నివర్గాలను భాగం చేయాలని వీసీ సూచించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న వలంటీర్లకు వీసీ ప్రసాద రెడ్డి హైజీన్ కిట్లను పంపిణీ చేశారు. వర్సిటీ పరీక్షల కేంద్రాలవద్ద సైతం కోవిడ్ అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని వీసీ సూచించారు.జాతీయ సేవాపథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ నగరంలో 5 కళాశాలలకు చెందిన 120 వలంటీర్లు పాల్గొనడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇటిఐ సమన్వయకర్త డాక్టర్ పి.రామ చంద్రరావు, ప్రోగ్రాం అధికారులు పి.రోజ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్షయవ్యాధిపై అందోళన వద్దు




కంచరపాలెం : క్షయ వ్యాధిపై అందోళ చెందాల్సిన అవసరం లేదని క్షయ వ్యాధిని గుర్తించి చికిత్స పొందితే వ్యాది ని నివారించవచ్చని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 53 వ వార్డు పరిధి జ్యోతి నగర్ వార్డు కార్యలయంలో గురువారం క్షయ వ్యాధి నివరణపై స్థానిక ప్రజలకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా క్షయ లక్షణాలతో బాధపడుతున్న వారి వద్ద కఫము నమూనాలు సేకరించి పరిక్షలకు పంపించారు. వారం రోజుల పాటూ దగ్గు రావటం, జ్వరం, ఆకలి తగ్గడం క్షయ లక్షణాలని ఇంటువంటి లక్షణాలు గుర్తిస్తే తక్షణం వైద్యులని సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధి బారిన పడ్డ వారు 6 నెలల నుండి ఒక సంవత్సరం లేక రెండు సంవత్సరాలు మందులు వాడాల్సి వుంటుందని మందులు వాడిన వ్యక్తికి ప్రతి నెల పౌషకాహారం నిమిత్తం 500 అందజేయటం జరుగుతుందన్నారు. ప్రతి నెల 24 వ తేది క్షయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించటం జరిగిందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వైధ్యులు కాశీవిశ్వనాధం, మౌనిక, సచివాలయం ఎ.ఎన్.ఎం అనితా, ఆశావర్కర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# షిరిడీ సాయిబాబా గుడి నూతన కార్యవర్గ ఎన్నిక

మధురవాడ : మహా విశాఖ 6 వ వార్డ్ పరిధి పీఎంపాలెం చివరి బస్ స్టాప్ సమీపంలో గల శ్రీ షిరిడి సాయిబాబా గుడి వద్ద గురువారం గుడి సభ్యులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు అనంతరం నూతన కార్యవర్గానికి అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా ఈఎన్ఎస్ చంద్ర రావు, సెక్రెటరీగా రాంబాబు, కోశాధికారి గా కొల్లు గోవింద్ లను ఏకగ్రీవంగా ఎన్నికొన్నారు, నూతన కార్యవర్గ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ శిరిడిసాయిబాబా ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించుటకు ఎల్లవేళలా కట్టుబడి ఉంటానని, సాయశక్తులా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అలాగే గౌరవ సలహాదారుడిగా గోల్లంగి ఆనందబాబు , ఉపాధ్యక్షులుగా ప్రసాదరావు, వీరితో పాటు మిగిలిన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.



# విజయభాను

## సంపాదకీయం

### సమయోచిత వ్యూహకర్త

దక్కన్ పీఠభూమిలోని నడిగడ్డ ప్రాంతం తెలంగాణ ముద్దుబిడ్డ పాములపర్తి వేంకట నరసింహారావు. వెనుకబడిన ప్రాంతంగా చెప్పుకోబడే తెలంగాణ నుంచి వచ్చిన అనర్ఘరత్నం. ఉత్తరాది వారి ఆధిపత్యంలో కొనసాగుతున్న కేంద్ర రాజకీయాల్లో, జాతీయపార్టీల్లో దక్షిణాది నాయకులు ప్రధానమంత్రి స్థాయికి ఎదగడం అరుదైన విషయం.

ఏడున్నర దశాబ్దాలకు దగ్గరున్న స్వతంత్ర భారత రాజకీయాల్లో దేవెగౌడ కొన్ని నెలల తాత్కాలిక ప్రధానమంత్రిత్వం తప్ప దక్షిణాదికి తగిన ప్రాతినిధ్యం లభించలేదు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో దేశ ప్రధాని పగ్గాలు చేపట్టి ఐదేండ్లు సమర్థ పాలననిచ్చి దక్షిణాది నాయకత్వ పటిమను దేశానికే కాదు ప్రపంచానికే చాటిచెప్పిన చాణక్య రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు. ఆ విశిష్ట నేత, ఈ నేల ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు శతజయంతి (2020-21) ఉత్సవాలను ప్రభుత్వం ఏడాది పొడువునా జరుపుతుండటం ఆయనకు ఇస్తున్న సముచిత గౌరవం. పీవీకి భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నది. దీనిని సమర్థించే వాళ్లున్నారు. విమర్శిస్తున్న వాళ్లూ ఉన్నారు. ఇది సహజం కూడా.

పీవీ మీదున్న ప్రధాన ఆరోపణల్లో నూతన ఆర్థిక విధానాలకు భారతదేశంలో ద్వారాలు తెరిచాడని. పీవీ ప్రధాని పగ్గాలు చేపట్టే సమయానికి దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. బంగారం నిల్వలను కూడా తాకట్టు పెట్టి అప్పులు తీసుకునే దుస్థితిలో ఉంది. మరో దిక్కు రష్యా సోషలిస్టు కల విఫలమై అమెరికా ఆధిపత్య ఏకధ్రువ ప్రపంచం ఏర్పడే దిశలో ప్రపంచం పయనిస్తున్నది. క్యూబా లాంటి ఒకట్రెండు దేశాలు తప్ప ప్రపంచ దేశాలు గ్లోబలీకరణ ప్రభావం నుంచి తప్పించుకోలేని స్థితి. అలాంటి పరిస్థితుల్లో పీవీ రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా పనిచేసిన ప్రముఖ ఆర్థిక నిపుణుడు మన్మోహన్‌సింగ్‌ను ఆర్థికమంత్రిని చేశారు. నూతన ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టారు. ఆ రకంగా గ్లోబలైజేషన్‌ను అంగీకరించినట్టే. అది మంచిదా? చెడ్డదా? అనే చర్చ ప్రపంచమంతటా జరిగింది. చదువుల కోసం పశ్చిమ దేశాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగింది. భారతదేశం లాంటి కుల సమాజంలో అట్టడుగు బహుజన కులాల వారు కూడా విదేశీ ఉద్యోగాలు పొందారు. ఇంగ్లీష్ మాధ్యమ చదువుల జోరు పెరిగింది. ఇలా చాలామందికి లాభం జరిగిందనే వాదనొక వైపుంటే వృత్తి పనులు దెబ్బతిని వృత్తి కులాల ఆదాయమార్గాలు దెబ్బతిన్నాయన్న వాదన మరో వైపుంది. ఏదేమైనా మొత్తం ప్రపంచాన్నే గ్లోబలైజేషన్ ప్రభావితం చేసింది. చైనా లాంటి కమ్యూనిస్టు దేశం కూడా కన్స్యూమరిజాన్ని ప్రోత్సహించి వ్యాపార సంస్కృతిని ఆహ్వానించిందంటే దాని ప్రభావమేమిటో అర్థమవుతున్నది కదా?

పీవీని నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టినవాడిగా మాత్రమే చూడకూడదు. ఆ విధానాలు కావచ్చు, పీవీ, మన్మోహన్‌సింగ్‌ల ఆర్థిక విధానాల ఆలోచనాసరళి కావచ్చు భారతదేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి రక్షించాయి. దేశ మత, ప్రాంతీయత, దేశీ వస్తువుల ఉపయోగం, రామానందతీర్థ శిష్యరికం, ఖద్దరు లాంటి గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించడం జీర్ణించుకున్న పీవీ ప్రపంచీకరణను, నూతన ఆర్థిక విధానాలను బిగియారా కౌగిలించుకునే స్వభావం ఉన్నవాడు కాదు. దేశ ఆర్థిక దుస్థితిని చూసి వాటిని ప్రయోగాత్మకంగా మాత్ర మే ప్రవేశపెట్టానని అనేక సభల్లో చెప్పారు. నష్టాల్లో నడుస్తున్న పరిశ్రమలను సిక్ యూనిట్స్‌గా ప్రకటించాడు తప్ప ఒక్క కర్మాగారాన్నీ మూసివేయలేదు. ప్రైవేటీకరణ చేయలేదు. జీతాలను ఆపలేదు. కానీ ఆ తర్వాత కేంద్రంలో వచ్చిన ప్రభుత్వం అన్ని కర్మాగారాలను మూసివేసి లక్షల మందిని రోడ్డుపై నిలబెట్టింది. ఎవరి బాధ్యత ఎంతున్నా పీవీ ప్రారంభించిన ఆర్థిక విధానాలే ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా గత పాతికేండ్లకు పైగా కొనసాగుతున్నాయన్నది వాస్తవం. అప్పుడున్న దేశ ఆర్థికస్థితిని దృష్టిలో పెట్టుకొని తప్పనిసరై ప్రయోగాత్మకంగా మాత్రమే పీవీ నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టాడు తప్ప లక్షల మంది ఉద్యోగాలు తీసివేయడానికి కాదు. ఆ పాపం ఆ తర్వాత వచ్చిన ప్రధానమంత్రులదే తప్ప పీవీది కాదు. ఆయనను దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి, గ్లోబల్ మాయ ఆర్థిక విధ్వంసం నుంచి కాపాడినవాడిగా చూడాలే తప్ప గ్లోబలైజేషన్‌ను ఆహ్వానించినవాడుగా కాదు. ఆ సమయంలో పీవీ దేశ ప్రధాని కావడం కాకతాళీయమే. ఆ స్థానంలో ఎవరున్నా గ్లోబలైజేషన్‌పై ప్రతిఘటన ఆ మాత్రంగా కూడా ఉండేది కాదేమో!

పీవీ యాభయ్యేండ్లకు పైగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేశారు. రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి స్థాయివరకు ఎదిగారు. నెహ్రూ కుటుంబంలో ఇందిరాగాంధీకి, రాజీవ్‌గాంధీకి అత్యంత సన్నిహితులు. సలహాదారులు కూడా. కష్టకాలంలో కాంగ్రెస్‌ను ఆదుకొని గట్టెక్కించారు.

## దిగ్గజ క్రికెటర్ డీన్ జోన్స్ కన్నుమూత



ముంబై: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డీన్ జోన్స్(59) కన్నుమూశారు. ప్రస్తుతం ముంబైలో ఉన్న జోన్స్‌కు గురువారం గుండెపోటు రావడంతో చనిపోయారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ తరపున వ్యాఖ్యానం చేసేందుకు ఆయన భారత్‌కు వచ్చారు. తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో డీన్ ఆసీస్ తరపున 52 టెస్టులు, 164 వన్డేలు ఆడాడు. 1984 నుంచి 1992 మధ్య ఎనిమిదేండ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్లో ఆసీస్‌కు ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో 46.11 సగటుతో 3631 పరుగులు సాధించాడు. అందులో 11 శతకాలు, 14 అర్ధశతకాలు ఉన్నాయి.

## ఉద్యమంలా ఫిట్ ఇండియా : కోహ్లీతో మోదీ



న్యూఢిల్లీ : ఉద్యమంలా ఫిట్ ఇండియాను ప్రజల్లోకి తీసుకుపోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మనం ఫిట్‌గా ఉంటేనే మన దేశం ఫిట్‌గా ఉంటుందని, అందుకే ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఉండేందుకు యోగా, ధ్యానం, వ్యాయామం చేయాలన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దుబాయ్‌లో ఉన్న విరాట్ కోహ్లీతో మోదీ మాట్లాడారు. అలాగే పలువురు క్రీడాకారులు, సినిమా నటులు, వ్యాయామ నిపుణులతో మోదీ మాట్లాడారు. వారి నుంచి పలు సూచనలు తీసుకోవడమే కాకుండా వారికి కూడా పలు సలహాలు ఇచ్చారు. జట్టు కోసం యోయో పరీక్షలకు హాజరవడం తప్పనిసరి అని, కెప్టెన్ కూడా దీనిలో పాల్గొనాల్సిందే. ఈ పరీక్షలు ఆటగాళ్ల ఫిట్‌నెస్ స్థాయిని పెంచుతుంది. ఎవరైనా ఈ పరీక్షల్లో విఫలమైతే ఎంపిక సాధ్యం కాదని విరాట్ కోహ్లీ చెప్పారు. ఫిట్‌గా ఉంటే మనం ఎక్కడ ఉన్నా అక్కడి ఆహారం, పానీయాలు మనపై ఎలాంటి ప్రభావం చూపవన్నారు. శరీరం, మనసు రెండూ ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యమని కోహ్లీ చెప్పారు. 55 ఏండ్ల వయసులోనూ ఇంత ఫిట్‌గా ఎలా ఉండగలుగుతున్నారని, ఇది ఎలా సాధ్యమైందని నటుడు మిలింద్ సోమన్‌ను మోదీ ప్రశ్నించగా.. చాలా చిన్న వయసు నుంచి వ్యాయామం చేయడం దినచర్యలో భాగం చేసుకున్నానని, 81 ఏండ్ల నా తల్లి కూడా ఎంతో ఫిట్‌గా ఉన్నదని చెప్పారు. ఏ జిమ్‌కు వెళ్లకుండా, ఎలాంటి పనిముట్లు వాడకుండా ఇంట్లోనే వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్ సాధించానని, నిత్యం కనీసం నాలుగు గంటలు వ్యాయామంలో గడుపుతామని తెలిపారు. ప్రజలు ఫిట్‌నెస్ గురించి తెలుసుకుని దాన్ని అందుకోవడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. వయసు 40 దాటిపోయాం, ఇక వ్యాయామం చేయలేమని సాకులు చెప్పకుండా ఏ వయసులోనైనా వ్యాయామం చేయొచ్చని గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఫిట్‌నెస్ పని పెద్ద స్థాయిలో జరుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రతిదీ ఆరోగ్యం మీద ఆధారపడి ఉంటున్నందున ఫిట్‌నెస్‌లో ఎక్కువ మంది పాల్గొనడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కుటుంబంతో కలిసి కూడా వ్యాయామాలు చేయవచ్చని, ఇలాంటి మంచి అలవాట్లను పిల్లలకు బోధిస్తూ వారిని చిన్న వయసు నుంచే ఫిట్‌గా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదన్నారు. ప్రస్తుత కరోనా మహమ్మారి సమయంలో ప్రజల్లో ఆరోగ్యం గురించి అవగాహన వచ్చిందని, వ్యాయామం, యోగా, ధ్యానంతో ఫిట్‌గా ఉండేందుకు ప్రజలు నిత్యం కష్టపడ్డారని, ఇకముందు కూడా వీటిని వదలకుండా నిత్యం అభ్యాసన చేయడం ద్వారా మరింత ఆరోగ్యం పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో న్యూట్రిషన్ అండ్ ఫిట్‌నెస్ నిపుణుడు రుజుటా దివేకర్, ఆధ్యాత్మిక గురువు శివ ధ్యానం సహా పలువురితో నరేంద్ర మోదీ మాట్లాడారు.

## అధ్యక్ష ఎన్నికల ఫలితాలు తేల్చేది సుప్రీంకోర్టే : ట్రంప్



హైదరాబాద్ : అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాది నవంబర్ 3వ తేదీన జరగనున్నాయి. ఒకవేళ ఆ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఓడిపోతే ఏం జరుగుతుందో తెలుసా. ఈ అంశానికి సంబంధించి ట్రంప్‌నే ఓ జర్నలిస్టు ప్రశ్నించారు. అధికార బదిలీ సజావుగా సాగుతుందా అని ట్రంప్‌ను ప్రశ్నించగా.. దానిపై కామెంట్ చేసేందుకు రిపబ్లికన్ నేత నిరాకరించారు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే అన్నారు. వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అమెరికా ఎన్నికల ఫలితాలను బహుశా సుప్రీంకోర్టు తేల్చే అవకాశాలు ఉన్నట్లు ఆయన డౌట్ వ్యక్తం చేశారు.

కరోనా నిబంధనల నేపథ్యంలో ఈ సారి అమెరికా ఎన్నికల కోసం పోస్టల్ ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ-మెయిల్ ఓటింగ్‌పై ట్రంప్ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా డెమోక్రటిక్ అభ్యర్థి బైడెన్ గెలిచే అవకాశాలు ఉన్నట్లు ట్రంప్ విమర్శించారు. డెమోక్రటిక్ పార్టీ పోస్టల్ బ్యాలెట్‌తో రిగ్గింగ్‌కు పాల్పడుతుందని ఆరోపించారు. బ్యాలెట్ల గురించి చాలా బలమైన వ్యతిరేక స్వరాన్ని ట్రంప్ వినిపించారు. బ్యాలెట్లతో పెను నష్టం జరిగే ఛాన్సు ఉన్నట్లు ఆయన తెలిపారు. బ్యాలెట్ విధానాన్ని తీసివేస్తే.. చాలా శాంతియుతంగా ఎన్నికలు జరుగుతాయని, అప్పుడు అధికార బదిలీ ఉండదని, కేవలం కొనసాగింపు మాత్రమే ఉంటుందని ట్రంప్ అన్నారు.

## కవి సమయం

### మంచి మాట

మంచి మాట మహాత్ముల లక్షణం
మంచిగా మాట్లాడు, ప్రేమతో మాట్లాడు
సహృదయంతో, ఓదార్పునిస్తూ మాట్లాడు
చల్లని వెన్నెలలా
స్వాంతన కలిగించే మందులా
గిలిగింతలు పెట్టి తొలకరి జల్లులా
ప్రేమగా, ఆనందంగా
పరులకు సంతోషానిచ్చే విధంగా
మన పలుకులు వుండాలి
పదునైన ఆయుధంతో
తుట్లు పొడిచేలా వచ్చే మాటలు
వినాశ హేతువు, విధ్వంస కారకం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : అధిక ఆశ్వయుజ ; తిథి : నవమి రా.10.31; పూ.షా.రా.11.06; ఉ.వ.9.00ల 10.34.

శుక్రవారం 25-09-2020

**మేషం :** పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. విద్యార్థులకు ప్రింటింగ్ రంగాలవారికి సదా వకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. బంధువులను కలుసుకుంటారు.

**వృషభం :** కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగస్తులు, ఒత్తిళ్ళు, ఆకర్షణలకు దూరంగా ఉండటం అన్నివిధాలా క్షేమదాయకం. మీ శ్రీమతి సూటిపోటి మాటలు అసహనం కలిగిస్తాయి. దైవ సేవా కార్యాక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. అనుకోకుండా నిరుద్యోగుల యత్నాలు ఒక కొలిక్కి రాగలవు.

**మిథునం :**బ్యాంకు వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. వీలైనంతవరకు మీ పనులు మీరే చూసుకోవటం ఉత్తమం. ఆదాయాన్ని కన్నా ఖర్చులు అధికంగా ఉంటుంది. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునారాలోచన మంచిది. విద్యార్థినులకు ఒత్తిడి ఆందోళనలు ఎదుర్కొంటారు.

**కర్కాటకం:** వ్యాపారవేత్తలు ప్రస్తుత పరిస్థితిని కొనసాగ నివ్వడం మంచిది. ప్రముఖులను కలుసుకుంటారు. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. ప్రింటింగ్ రంగాలవారికి సదవకాశాలు లభిస్తాయి. మీ సంతానం మొండివైఖరి మీకెంతో చికాకు కలిగిస్తుంది. హామీలు చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి.

**సింహం :**విద్యార్థులు తోటి విద్యార్థులతో విందులు, వేడుకలలో పాల్గొంటారు. అవసరానికి సరిపడ ధనం సమకూరుట వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. మీ అవసరాలకు కావలసిన ధనం సమయానికి సర్దుబాటు అవుతుంది. ప్రైవేట్ ఫైనాన్సు సంస్థలో పొదుపు చేయటం మంచిది కాదని గమనించండి.

**కన్య :** పెద్దల జోక్యంతో అనుకోకుండా ఒక సమస్య సానుకూలమవుతుంది. పంతాలకు పోకుండా బంధువులతో ఆదరంగా మెలగండి. బంధుమిత్రుల కలయికతో ఉత్సాహం చోటుచేసుకుంటుంది. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తుతాయి. స్త్రీలకు షాపింగ్ విషయాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళకువ అవసరం.

**తుల :** ఆత్మీయుల నుంచి అందిన ఆహ్వానం మిమ్ములను ఇరకాటానికి గురిచేస్తుంది. విలాసవస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. చేతి వృత్తులు, చిరు వ్యాపారులకు అన్నివిధాలా కలిసివస్తుంది. ప్రయాణాలలో ఇబ్బందులు తలెత్తుతాయి. నిరుద్యోగలకు రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు సత్ఫలితాలనిస్తాయి.

**వృశ్చికం :** పాత మిత్రులను కలిసి వారికి శుభాకాంక్షలు అందజేస్తారు. నూతన పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగస్తులకు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. నూతన వస్త్రప్రాప్తి ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. రుణ విముక్తులు కావడంతో మానసికంగా కుదుటపడతారు.

**ధనుస్సు :**రాజకీయ నాయకులు పార్టీ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. సంఘంలో మీ స్థాయి పెరుగును. పెద్దల ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారరీత్యా దూరప్రయాణాలు చేస్తారు. బంధుమిత్రులకు, ప్రముఖులకు శుభాకాంక్షలు అందజేస్తారు. టెక్నికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్, రంగాల్లో వారికి ఒత్తిడి తప్పదు.

**మకరం :**ఆర్థికంగా ఎదగాలనే మీ ఆశయం నిదానంగా ఫలిస్తుంది. కుటుంబీకులతో కలిసి విందులు, వినోదాలు, సమావేశాలు ఉల్లాసంగా కలిగిస్తాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తారు. ధనం చేతిలో నిలబడటం కష్టమే.

**కుంభం :** విద్యార్థులకు హడావుడి, తొందరపాటు తగదు. వస్త్ర, బంగారం, వెండి, లోహ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. విందు, వేడుకలలో చురుకుగా పాల్గొని అందరిని ఆకర్షిస్తారు. కళ, క్రీడా, సాంకేతిక రంగాలవారికి ప్రోత్సాహకరం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం.

**మీనం :** విందులలో పరిమితి పాటించండి. వాహనం ఇతరులకు ఇచ్చిఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉపాధ్యాయులు పైఅధికారులతో సంభాషించి


## లక్ష్మీదేవిని పూజిస్తే.. శుక్రగ్రహ దోషాలు తొలగిపోతాయట!



జీవితంలో కొన్ని సమస్యలకు పరిష్కారాలు వేరే కావచ్చు. అయితే మరికొన్ని సమస్యలకు అవసరాలకు డబ్బే ప్రధానం. ధనానికి ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు, దారిద్ర్యంతో కష్టాలు అనుభవిస్తుంటే.. ఇక ఆలోచించకుండా శుక్రవారం మహాలక్ష్మీదేవిని పూజించాల్సిందే.

ఆ తల్లి కటాక్షం కావాలంటే అంకితభావంతో కూడిన పూజాభిషేకాలు జరపవలసి వుంటుంది. శుక్రవారం రోజున భక్తిశ్రద్ధలతో సేవించవలసి వుంటుంది.

అందువలన అమ్మవారు ప్రీతి చెందుతుందనీ, ఫలితంగా దారిద్ర్యం తొలగి పోయి సంపదలు ప్రసాదించబడతాయని పురోహితులు అంటున్నారు. అంతేకాదు అమ్మవారిని అర్చించడం వలన శుక్ర గ్రహ సంబంధమైన దోషాలు కూడా తొలగిపోతాయని ఆధ్యాత్మిక గ్రంధాలు




చెబుతున్నాయి.

అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తికాకపోవడం, అవమానాలు ఎదురుకావడం, అనారోగ్యం వంటివి శుక్రగ్రహ దోషంతో ఏర్పడుతాయి. అందుచేత శుక్రగ్రహ దోషాలను తొలగించుకోవాలంటే..

లక్ష్మీపూజ తప్పనిసరి అని పండితులు అంటున్నారు. అందుచేత శుక్రవారం రోజున ఉపవాస దీక్షను చేపట్టి, అమ్మవారి ఆలయంలో...

ప్రదక్షిణలు చేయడం వలన ... పూజాభిషేకాలు జరపించడం వలన ఆశించిన ఫలితం లభిస్తుందని వారు సూచిస్తున్నారు.



# పశువులుకు ఇనాఫ్ ఇన్సూరెన్స్ చెవిపోగులు వేయించుకోవాలి

## పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి



పరవాడ : పరవాడ గ్రామ పరిధిలో ఎవరైనా రైతులు పశువులకు ఇనాఫ్ ఇన్సూరెన్స్ చెవి పోగులు వేయించుకొని యెడల వెంటనే పరవాడ పశువుల ఆసుపత్రిలో నమోదు చేయించుకుని సిబ్బందితో ఇన్సూరెన్స్ పోగులు వేయించుకోవాలి అని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ రామకృష్ణ కీర్తి అన్నారు.అనంతరము అయన మాట్లడుతూ వీటి వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయి అని తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా ఒక ఈత ఈనిన మేలు జాతి పశువులన్నింటికీ రూ 30,000/-, దేశవాళీ(నాటు జాతి) పశువులకు రూ.15,000/-డా.వై ఎస్ ఆర్ పశు నష్ట పరిహారం అందజేయబడుతుందని, పరవాడ గ్రామ రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని అయన కోరారు. పశుసంపద ఉన్న రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.1,60,000/- వరకూ బ్యాంకుల నుండి అతితక్కువ వడ్డీతో హామీ లేకుండా నగదు పొందవచ్చని,డా.రామకృష్ణ కీర్తి తెలియపరిచారు.

లబ్దిదార్లు అందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం పరిచికోవాలనీ ఈసందర్భంగా అయన కోరారు.

# త్రిశక్తి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు



మధురవాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి 6 వ వార్డ్ కొమ్మాది కూడలిలో గల త్రిశక్తి గల శ్రీ బంగారమ్మ, శ్రీ ఎర్నమ్మ, శ్రీ దండు మారమ్మ అమ్మవార్ల ఆల యంలో గురువారం సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఎంపాలెం సిఐ ఎ.రవి కుమార్ విచ్చేసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

ప్రస్తుతం పలు ఆలయాలలో జరుగుతున్నా అవాంఛనీయ సంఘటనలు దృష్ట్యా వాటిని అరికట్టడంలో సిసి కెమెరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, కుడితి రామారావు, పిళ్లా పాపారావు, పిళ్లా సూరిబాబు, పిళ్లా అప్పన్న, వాండ్రాసి సన్యాసిరావు, యమ్.గణపతిరావు, ఇమంది వెంకటరావు నమ్మి అప్పలస్వామి, నీలి తాతారావు, పీరుబాబు, ఎర్రినాయుడు, భవాని, సత్తిబాబు, ఆలయ అర్చకులు యన్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కరోనా నుండి పూర్తిగా కోలుకోవాలని

# శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి సేవాపీఠం వద్ద చండీ హెూమం



భీమునిపట్నం : భీమిలి రూరల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ అయ్యప్పస్వామిసేవాపీఠం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి .శ్రీనివాసరావు కరోనా నుండి పూర్తిగా కోలుకోవాలని మంత్రి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు గాను గణపతిపూజ కార్యక్రమము మరియు "చండీహెూమం" కార్యక్రమము గురువారం ఉదయం 10 గంటలు నుండి మధ్యాహ్నం 3 గంటలు వరకు శ్రీ శ్రీ శ్రీ అయ్యప్పస్వామిసేవాపీఠం,లక్ష్మీపురం వద్ద భీమిలి మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ గాడు శ్రీను ఆధ్వర్యంలో పాలకొండ పంతులు వేధ మంత్రాలతో గణపతి పూజ. చండీహెూమం. పవిత్రంగా ఘనంగా జరిగింది పూజాకార్యక్రమము అనంతరము ప్రసాదవితరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో భీమిలి వైసిపి నాయకులు పద్మనాభం మండలం వైసిపి అధ్యక్షుడు కంటుబోతు రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి సుంకర గిరిబాబు భీమునిపట్నం రూరల్ మండల నాయకులు వాసు రాజు, బోని బంగారునాయుడు, మద్దిల వెంకటరమణ,. కె పి సత్యన్నారాయణ, తుపాకుల అప్పల రాజు. నీలాపు సూర్య నారాయణ పొన్నూరు చంద్రశేఖర్,.కనకల వెంకట రమణ . గాడు తాతినాయుడు . కరుభుక్త అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం పంపిణీ

గొలుగొండ : మండ లంలో చీడిగుమ్మల అంగన్వాడీ కేంద్రంలో

గురువారం వైయస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రభు త్వం పంపిణీ చేస్తున్న పోషకాహా రాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.



వైయస్సార్ పోషణ కార్యక్రమం

# మంత్రి కొడాలి నానిపై చర్యలు తీసుకోవాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

కొయ్యూరు : కొయ్యూరు మండల బిజెపి అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు సమక్షంలో... హిందువుల మనోభావాలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన మంత్రి కొడాలి నానిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గురువారం కొయ్యూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సుంకర వీరబాబు, రాంబాబు, మంగతల్లి రాజారావు, దూరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా సేవించి ఇద్దరు మృతి

## విషప్రయోజనం జరిగిందంటున్న గ్రామస్థులు

కొయ్యూరు : నాటుసారా సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే కొయ్యూరు మండలం కినపర్తి పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన జనుమూరు బాలరాజు(33) అతని స్నేహితుడు గొలుగొండ మండలం కేడిపేటకు చెందిన మత్స్యవెంకటరత్నంనాయుడు(46) గురువారం ఉదయం నాటుసారా సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీన్ని గమనించిన బంధువులు వారిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలరాజు మృతి చెందాడు. అనంతరం మత్స్య వెంకటరత్నంనాయుడు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు బాలరాజు భార్య మల్లయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు సిఐ వెంకటరమణ, ఎస్సై దాసరి నాగేంద్ర సంఘటనపై విచారణ చేపట్టారు. వారు తాగిన నాటుసారాలో విష ప్రయోగం జరిగి ఉంటుందని వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారన్నారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. విశాఖపట్నం నుంచి క్లూస్ టీమ్‌తో సాక్ష్యాలు సేకరించడం జరిగిందన్నారు. పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు.





మృతి చెందిన బాలరాజు, వెంకటరత్నంనాయుడు

# కొత్తూరు రేషన్ డిపో తనిఖీ



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న దృశ్యం

గొలుగొండ : మండలంలో గుండుపాల పంచాయతీజి.కొత్తూరు గ్రామం రేషన్ డిపోను గురువారం పౌరసరఫరాలశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్ అప్పారావు డిపో వద్ద సరుకులు వ్యత్యాసాలు ఉన్నాయని వాటిని గుర్తించడం జరిగిందని సివిల్ సప్లై అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం, శనగలు, కందిపప్పు ఉన్న సరుకులు కంటే అధికంగా ఉండటంతో 6ఏ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

గతంలో కూడా ఈ రేషన్ డిపోపై తనిఖీలు నిర్వ హించడం జరిగిందని అప్పుడు కూడా రేషన్ డిపో డీలర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

# బీజేపీ ఆధ్వర్యంలో పోలీసులుకు మాస్కులు పంపిణీ

పరవాడ : భారతీయ జనతా పార్టీ నాయకులు మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలలో బాగంగా పరవాడ పోలీసు స్టేషన్‌కి చేరుకొని కోవిడ్ సమయంలో వారిచేసిన సేవలను అభినందిస్తూ వారికి యన్.95. మాస్కులు అందజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో పెంధుర్తి కోకన్వీనర్ మాజీ జడ్పిటిసి సభ్యులు బొద్దపువెంకటరమణ, జిల్లాఉపాధ్యక్షుడు.ముత్యాల అప్పారావు, పట్టాభిప్రశాద్ ,సతీష్ ,యస్.యస్.నాయుడు, వీరు నాయుడు, నూకరాజు మొదలగువారు పాల్గొన్నారు.



# బీజేపీ సమీక్షా సమావేశం



భీమునిపట్నం : పద్మనాభం మండలం రెడ్డిపల్లి లో బీజేపీ మండల అధ్యక్షుని నివాసం వద్ద బీజేపీ పద్మనాభం మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాస రావు, బీజేపీ పద్మనాభం మండల కోఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు, బీజేపీ విశాఖ నగర కార్యదర్శి వాసుపల్లి శ్రీహరి ఆధ్వర్యంలో బీజేపీ పద్మనాభం మండల కార్యవర్గ సమీక్ష సమావేశం నీర్వహించారుఈ సమావేశం లో మండల కమిటీని సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పద్మనాభం కోఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కొరకు మండల నాయకత్వం గట్టిగా పనిచేయాలని అన్నారు. ప్రధానమంత్రి ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాడపల్లి వెంకటరావు, ఉప్పాల వెంకటరావు, వాడపల్లి శ్రీరామ మూర్తి, పైల సురేష్, గెద్ద వెంకటరాజు, వాడపల్లి కమలమ్మ, తిప్రెడ్డి లావణ్య లు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలను ఐటిడిఎలో చేర్చాలి



గొలుగొండ : మండలంలో 44 గిరిజన గ్రామాలను ఐటిడిఎలో చేర్చాలని కోరుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో వైసిపి గిరిజన యువ నాయకుడు కసిమి రమణ ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి గిరిజనులు గురువారం గొలుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

వెంటనే గ్రామాలు అన్నింటిని కలిపి ఐటిడిఎలో కలపాలని వారు డిమాండ్ చేశారు.

# విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్ పనులు వేగవంతం

## ఇండస్ట్రీస్ డైరెక్టర్ జె.వి.ఎన్ సుబ్రహ్మణ్యం



విశాఖపట్నం : విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్ జె. వి.ఎన్. సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తో కలిసి ఆయన వివిధ విషయాలపై సమీక్షించారు. ఇండస్ట్రియల్ కారిడార్ కు సంబంధించి భూ సేకరణ వేగంగా పూర్తి చేయాలన్నారు. కారిడార్ కు సంబంధించిన భూమిని గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అభివృద్ధి పనులకు కేటాయించిన భూమిని సంబంధిత శాఖలకు అందజేయాలన్నారు.

ముందుగా నక్కపల్లి మండలం చందనాడ గ్రామంలో నెలకొల్ప బోయే సబ్ స్టేషన్ కు భూమిని, అనకాపల్లి నుండి అచ్యుతాపురం వరకు నిర్మించబోయే రోడ్డు, నక్కపల్లి నుండి ఇండస్ట్రియల్ క్లస్టర్ వరకు చేసే రోడ్లకు సంబంధించిన భూమిని వేగంగా పనులు ప్రారంభించేందుకు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కాపులుప్పాడ లోని విద్యుత్ సబ్ స్టేషన్ భూగర్భ కేబుళ్ళ ఏర్పాటు కు అనుమతి పై జీవీఎంసీ, నేషనల్ హైవే అధికారులతో సమీక్షించారు. ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులో భాగంగా విద్యుత్ వాహనాల కొనుగోలుకు డిపిఆర్ ను సమర్పించడం పై కూడా ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్. మౌర్య, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగేశ్వరరావు, అనకాపల్లి ఆర్టీవో సీతారామరావు, ఎస్ డి సి అనిత, ఏపీ ట్రాన్స్ కో, జీవీఎంసీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పథకాలు: ఎమ్మెల్యే



బలిజిపేట : అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పి.చాకరాపల్లిలో రూ.40 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించ తలపెట్టిన సచివాలయ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అజ్జాడ-చాకరాపల్లి రహదారి పనులను సత్వరమే చేపట్టే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో....

ఎంపీడీవో డీవీఅప్పారావు, తహసీల్దారు పి.గణపతి, వైకాపా నాయకులు పాలవలస మురళీకృష్ణ, కురిటి మోహనరావు, అక్కేన ఎల్లంనాయుడు పాల్గొన్నారు.

బెలగాం : పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఉన్న నిధులను సకాలంలో ఉపయోగించుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధికారులకు సూచించారు.

కమిష నరు కనకమహాలక్ష్మితో కలసి పురపాలక అధికారులతో నిధులు, అభివృద్ధి పనుల స్థితిగతులపై సమీక్షించారు.



రొలుగుంట మండలం యం కే పట్నంలో ; రొలుగుంట మండలం కొమరవోలు గ్రామంలో.. నర్సీపట్నం ప్రోజెక్ట్ నుండి అంగన్వాడీలు విరివిగా పోషకాహార ఉత్సవాల్లో భాగంగా తల్లులకు గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు.



## ఉన్నత ప్రాథమిక పాఠశాలను సందర్శించిన

# సర్వ శిక్ష అభియాన్ పివో విజయభాస్కర్



అన్నవరం : తూ.గో.జిల్లా స్దానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలను గురువారం తూ.గో.జిల్లా సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి విజయ భాస్కర్ సందర్శించారు.ఆయన పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు కార్యక్రమ పనులను పరిశీలించారు.అదేవిధంగా 9,10వ తరగతుల విద్యార్థులు అందరూ బౌధిక దూరం పాటించి,మాస్కులు తప్పనిసరిగా ధరించవలెనని సూచించారు. జగనన్న విద్యా కానుకలలో ఇవ్వబడిన పుస్తకాలు, దుస్తుల నాన్యతను పరిశీలించి ప్రతీ ఒక్కరు కోవిడ్ నిభందనలు పాటించాలని సూచించారు.నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దాలని ఎమ్.ఈ.వో కు,ప్రధానోపాధ్యాయుడుకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్.ఈ.వో రమణ,ఇన్ చార్చి ప్రధానోపాధ్యాయుడు రవి మాష్టారు,ఎలిమెంటరీ ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, సిఆర్పి లు నాని,నాగరాజు,ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవ డిగ్రీ కళాశాల నందు

# ఘనంగా 'ఎన్‌యస్‌యస్ డే' వారోత్సవాలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ అన్నవరం స్దానిక శ్రీ సత్యదేవ డిగ్రీ కళాశాల నందు "ఎన్.యస్.యస్ డే" వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రామిశెట్టి.రామ్మోహన్ రావు గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గాంధీజీ కలలు కన్న ఈ దేశంలో అందరూ సేవా భావము,అంకిత భావము అలవరుచుకోవాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎన్.యస్.యస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ యనమల. అప్పారావు, ఆర్.వి.రమణ. కె.లోవ రాజు, అధ్యాపకులు మరియు గంటా జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ డిప్యూటీ తహశీల్దార్ గా రవికుమార్



సీతమ్మధార : అర్బన్ డిప్యూటీ తహశీల్దార్ గా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు.

ఇదివరకు ఇక్కడ డీటీ గా విధులు నిర్వహించిన గురు మూర్తి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రవికుమార్ బాధ్యతలు తీసు కున్నారు. ఈ సందర్భంగా అర్బన్ తహశీల్దార్ జ్ఞానవేణి తో పాటుగా విఆర్వోలు సిబ్బంది అభినందనలు తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో సెమినార్

భీమునిపట్నం : స్థానిక ఎస్‌వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఉత్సవాల కోసం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని డాక్టర్ జినాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు.

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గ్లోరీ దయా కుమారి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల్లో సేవా గుణం అలవర్చు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి వెంకటేశ్వరి మాట్లాడుతూ కమ్యూనిటి లోకి వెళ్లి ప్రజలను ఆరోగ్యం విద్యా మరియు పరిసరాల పరిశుభ్రత గురించి వాలంటీర్ల తెలియజేయల్సిన అవసరం ఉందని అన్నారు.

ప్రతీ విద్యార్థి సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

# జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఈబి దాడులు

## స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీ ఎన్.శ్రీదేవీరావు



విజయనగరం : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటుబ్యూరో ఆధ్వర్యంలో జిల్లాలో జామి, నెల్లిమర్ల, విజయనగరం 1టౌన్, రామబద్రపురం, ఆంద్ర, గంట్యాడ పోలీసు స్టేషన్ల పరిధిలలో దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 08 ట్రాక్టర్లు,

50 లీటర్లు నాటుసారా, 800 కిలోల పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకొన్నట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావు గురువారం నాడు తెలిపారు. విజయనగరం జిల్లాఎస్పీ బి.రాజకుమారి ఆదేశాలతో ఎస్ఈబి అదనపుఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావుఆధ్వర్యంలో స్థానిక పోలీసులు స్పెషల్‌టీం, ఎస్.ఈ.బి సిబ్బందితో దాడులు నిర్వహించినట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావు తెలిపారు.



జామి పి.ఎస్ పరిధిలో, జామి గ్రామం, మాధవరావు మెట్ట దగ్గరలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 01 ట్రాక్టరును ఎస్ఈబి సిబ్బంది స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం జామి పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. నెల్లిమర్ల పి.ఎస్ పరిధిలో, తంగుడుబిల్లి గ్రామం దగ్గరలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 03 ట్రాక్టర్లును స్పెషల్‌టీం సిబ్బంది స్వాధీనం చేసుకొని, ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం నెల్లిమర్ల పోలీసులకు అప్పగించగా, కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. విజయనగరం 1 టౌన్ పి.ఎస్ పరిధిలో ఎఫ్.సి గొడౌన్ దగ్గరలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 01 ట్రాక్టరునుస్పెషల్‌టీం సిబ్బంది స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం విజయనగరం 1 టౌన్ పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు.

రామబద్రపురం పి.ఎస్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 01 ట్రాక్టరును స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. పాచిపెంట పి.ఎస్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 02 ట్రాక్టర్లును స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. రామబద్రపురం పి.ఎస్ పరిధిలో 10 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. ఆంద్ర పి.ఎస్ పరిధిలో 40 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. గంట్యాడ పి.ఎస్ పరిధిలో, కొటారుబిల్లి గ్రామం దగ్గరలో 800 కిలోల పిడిఎస్ బియ్యం, ఒక ఆటో స్వాధీనంచేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం గంట్యాడ తహశీల్దారుకు అప్పగించినారు. ఈ దాడుల్లో ఎస్ఈబి అధికారులు, సిబ్బంది, మరియు స్థానిక పోలీసులు పాల్గన్నారని ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు.

# సచివాలయ సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోండి

## - జిల్లా కలెక్టర్ మురళీధర్ రెడ్డి ఆదేశం



రామచంద్రాపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది తమతమ పనితీరును మరింతగా మెరుగుపెర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి ఆదేశించారు. రామచంద్రపురం పట్టణంలో ఆయన గురువారం పర్యటించారు.ఈ సందర్భంగా పట్టణంలోని ఏడో నెంబర్ సచివాలయాన్ని ఆయన సందర్శించారు.ఈసందర్భంగా ఆయన వార్డు సచివాలయాల్లో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.ముఖ్యంగా కుల,ఆదాయ దృవపత్రాల మంజూరు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.సిబ్బంది ఇచ్చిన సమాధానంపై ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నా లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈవ్యవస్థను తీసుకొచ్చిందన్నారు.గ్రామ,వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది తమ వృత్తిపట్ల మరింతగా అంకితమై ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆదేశించారు.అనంతరం కొత్తూరు మున్సిపల్ పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమంలో చేపడుతున్న పనుల తీరును ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా జరుగుతున్న పనుల తీరు పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ నాడు-నేడు పథకంలో చేపడుతున్న పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో రామచంద్రపురం ఆర్‌డిఓ గాంధీ, మున్సిపల్ కమిషనర్ రాజు గోపాల్ రావు,ఎంఈఓ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సేవా దృక్పథంతో మెలగాలి




విజయనగరం : విద్యార్థులు సేవా దృక్పథంతో మెలగాలని మహారాజ స్వయంప్రతిపత్తి కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-6 ప్రోగ్రామ్ ఆఫీసర్ గురుబిల్లి చంద్రశేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ను 24 సెప్టెంబర్ 1969లో జాతిపిత మహాత్మా గాంధీజీ 100 వ జయంతి సందర్భంగా అప్పటి యూనియన్ విద్యా శాఖ మంత్రి డాక్టర్ వి కె ఆర్ వి రావు గారు ప్రారంభించారు. జాతీయ సేవా పథకం ముఖ్య ఉద్దేశం (నాట్ మీ-బట్ యు) నేను కాదు నువ్వు కూడా ...ఎన్ఎస్ఎస్ యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి సమాజానికి సేవ చేసే విధంగా తీర్చిదిద్దడం, సమాజ సేవలో వారిని భాగస్వాములు చేయడం అని ఆయన తెలిపారు. ఈ జాతీయ సేవా పథకం లో చేసిన వాలంటీర్లకు పై చదువుల గాని, ఉద్యోగ అవకాశాలు ల్లో కానీ ప్రత్యేక కేటగిరిని పొందుపరచడం జరిగిందని తెలిపారు. ఎన్ ఎస్ ఎస్ లో జాయిన్ అయిన వాలంటీర్లకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యలో ఒక శాతం సీట్లు కేటాయించడం ద్వారా గతంలో ఉన్న పూర్వ విద్యార్థులు ఆదిత్య మరియు హరీష్ రసాయనశాస్త్రంలో ఆంధ్ర యూనివర్సిటీలో సీటు పొందారని, అదేవిధంగా పీ. సన్యాసినాయుడు హిమాచల్ ప్రదేశ్ లో జరిగినటువంటి జాతీయ అడ్వెంచర్ క్యాంపు కు, జె. భార్గవ్ ప్రతాప్ రాంచి లో జరిగిన జాతీయ ఇంటిగ్రేషన్ క్యాంపుకు హాజరయ్యారని, కె శ్రీకాంత్ విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు లో పాల్గొని మిమిక్రీ లో రాష్ట్రస్థాయి లో మొదటి స్థానం కైవసం చేసుకున్నారని, అదేవిధంగా ఎం రాజ్ కుమార్ ప్రకాశం లో జరిగినటువంటి జాతీయస్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో మొదటి స్థానం పొందారని తెలిపారు. ప్రతి ఏటా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేత రక్తదాన శిబిరాలు నిర్వహించడం, మొక్కల నాటించడం, ఎయిడ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు, అక్షరాస్యత ఆవశ్యకతను పెంపొందించే అవగాహనా కార్యక్రమాలు చేయడం, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని జాతీయ సేవా దినోత్సవం సందర్భంగా చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు.

# నటుడు విజయకాంత్‌కు కరోనా



చెన్నై: తమిళ రాజకీయ నాయకుడు, నటుడు విజయ కాంత్‌కు కరోనా వైరస్ పాజటివ్ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. "విజయ కాంత్‌కు సెప్టెంబర్ 22న కొవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. అయనకు చెన్నైలోని ఎం.ఐ.ఓ.టీ. హాస్పిటల్స్‌లో చికిత్స అందిస్తున్నాము. ప్రస్తుతం ఆయన ఆరోగ్య స్థితి నిలకడగా ఉంది. ఆయన త్వరలోనే పూర్తిగా కోలుకుని, డిశ్చార్జి అవుతారు." అని ఆస్పత్రి మేనేజింగ్ డైరక్టర్ పృధ్వీ మోహన్‌దాస్ ప్రకటించారు.

విజయకాంత్ డీఎండీకే (దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం) వ్యవస్థాపక అధ్యక్షుడు. అధికార ఏఐఏడీఎంకేకి మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నారు. కాగా, ఆయన ఆరు నెలలకు ఒకసారి సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటారని..ఈ క్రమంలో ఆస్పత్రికి వెళ్లిన ఆయనకు స్వల్పంగా కరోనా లక్షణాలు బహిర్గతం కావటంతో పరీక్షలు నిర్వహించగా..వైరస్ సోకినట్టు తెలిసిందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

## కరోనా పరీక్షలు ఎందుకు తగ్గించారు?:హైకోర్టు

హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా పరీక్షలు ఎందుకు తగ్గించారో తెలపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో కొవిడ్ పరీక్షలు కొన్ని రోజులు ఎక్కువగానూ మరి కొన్నిరోజులు తక్కువగా చేస్తున్నారని అభిప్రాయపడింది. రోజుకు 40వేల పరీక్షలు చేస్తామని ప్రభుత్వం గతంలో హైకోర్టుకు తెలిపిందని.. దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ధర్మాసనం ప్రశ్నించింది. కరోనా పరీక్షలు, చికిత్సలు, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజులు తదితర అంశాలపై దాఖలైన 24 వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది.

కరోనా ఆస్పత్రుల్లో పడకల కొరత ఉందని మీడియాతోపాటు వివిధ వర్గాలు చెబుతున్నాయని హైకోర్టు పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఐదు పడకలు ఉండాలని.. కానీ రాష్ట్రంలో ఒకటే ఉన్నట్లు తెలుస్తోందని వ్యాఖ్యానించింది. మిగతా రాష్ట్రాల్లో వెయ్యికి మూడు పడకలైనా ఉన్నాయని చెప్పింది. తెలంగాణ వాటి కన్నా ఎందుకు వెనుకబడి ఉందని ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. దీనికి గల కారణం తెలపాలని స్పష్టం చేసింది. పడకలు ఇంకా పెంచే ప్రణాళికలు ఉన్నాయా?.. ఉంటే కోర్టుకు తెలపాలని ఆదేశించింది. ఆక్సిజన్ సదుపాయం ఉన్న పడకలు కూడా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోందని.. వాటిని పెంచే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా? అనే దానిపై వివరాలు తెలపాలని ఆదేశాలు జారీ చేసింది.

# అమరావతికే నా మద్దతు

## కేంద్రమంత్రి అథవాలే



దిల్లీ: అమరావతిలో రాజధానిని కొనసాగించాల్సిన ఆవశ్యకతను తెలియజేసేందుకు దిల్లీ వెళ్లిన మహిళా ఐకాస నేతలు, రైతులు గత మూడు రోజులుగా పలువురు ఎంపీలు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నేతలను కలిసి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ కేంద్ర మంత్రులు రాందాస్ అథవాలే, మురళీధరన్‌ని కలిశారు. అమరావతి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. అమరావతిలో రైతులకు

జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ తీరుపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాందాస్ అథవాలే మాట్లాడుతూ... రాజధాని విషయంలో అమరావతి రైతుల డిమాండ్ న్యాయమైందని అన్నారు. అమరావతి రాజధానికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పేద, దళిత రైతులు రాజధాని కోసం భూములు త్యాగం చేశారన్న ఆయన.. ఈ అంశంపై ఏపీ సీఎం జగన్‌కు లేఖ రాస్తానని చెప్పారు. అమరావతి గొప్ప చారిత్రక ప్రాంతమని పేర్కొన్నారు.

## ఎ.ఎన్.ఎం/వార్డు హెల్త్ సెక్రటరీ పరీక్షకు 1184 మంది హాజరు

### - జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : ఎ.ఎన్.ఎం./వార్డు హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 ప్రవేశ పరీక్షకు 1184 మంది అభ్యర్థులు హాజరయినట్లు జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ రిక్రూట్ మెంట్ 2020 పరీక్షలలో భాగంగా ఎ.ఎన్.ఎం./వార్డు హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 ప్రవేశ పరీక్ష గురువారం జరిగింది. గురువారం మధ్యాహ్నం నిర్వహించిన ఈ పరీక్షకు 1184 మంది హాజరయినారని, 424 మంది అభ్యర్థులు గైర్హా జరయినారని తెలిపారు. ఈ పరీక్ష నిమిత్తం మొత్తం 1608 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, 74 శాతం హాజరైనారని తెలిపారు. వీరిలో కరోనా పేషెంటు ఒకరు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

# ప్రజలకు న్యాయవ్యవస్థపై అవగాహన ఉండాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామకృష్ణ

శ్రీకాకుళం : ప్రజలు న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.రామకృష్ణ తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎడ్యుకేషనల్ లైవ్ ఛానల్ ద్వారా లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద, బడుగు, బలహీన వర్గాలవారు ఎలాంటి ఫీజు చెల్లించకుండా ప్రభుత్వం కల్పించిన సదుపాయాల ద్వారా ఉచితంగా కోర్టు ద్వారా న్యాయం పొందవచ్చన్నారు.

అనంతరం న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించే అనేక రకాల సేవలను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.జయలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ యు.శ్రీనివాసవర్మ, జేకేసీ కో-ఆర్డినేటర్ డా.పైడితల్లి, విద్యా ఛానెల్ కన్వీనర్ ప్రదీప్, డా.రామకృష్ణ, ఎన్‌సీసీ అధికారి డా.పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి: కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్న వర్చువల్ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు భవనంలో వర్చువల్ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రాజీపడదగిన కేసుల పరిష్కారానికి వర్చువల్ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోవాలని చెప్పారు.

జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్లు శ్రీలక్ష్మి, లెనిన్‌బాబు, కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కొడాలి నాని వ్యాఖ్యలపై భాజపా ఆగ్రహం



అమరావతి: పౌరసరఫరాలశాఖ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలకు నిరసనగా భాజపా శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై కొడాలి నాని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన భాజపా నాయకత్వం ... రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల ఎదుట నిరసన తెలపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా గురువారం అన్ని జిల్లా కేంద్రాల్లో భాజపా శ్రేణులు ఆందోళనకు దిగాయి. కొడాలి నానిని మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పలు చోట్ల భాజపా శ్రేణులను పోలీసులు అరెస్టు చేయడం ఉద్రిక్తతలకు దారితీసింది. విజయవాడలో నిర్వహించిన ధర్నాలో భాజపానేత విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుపతిలో భానుప్రకాశ్‌రెడ్డి, కడపలో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. హిందూ సమాజాన్ని కొడాలి నాని అవమాన పర్చారని మండిపడ్డారు. గుడివాడలో భాజపా నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు.

# కోవిడ్‌ను జయించిన శతాధిక వృద్ధురాలు

## - కాకినాడ జీజీహెచ్ నుంచి గురువారం డిశ్చార్జ్ అయిన 127 ఏళ్ల కన్నారపు వీర రాఘవమ్మ

## - ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి ప్రశంసలు

కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్) వైద్యులు అరుదైన ఘనత సాధించారు. కరోనా సోకిన 127 ఏళ్ల వృద్ధురాలికి మెరుగైన చికిత్స అందించి, ఆమె కోలుకునేలా చేశారు. వృద్ధులకు కరోనా సోకితే బయటపడటం కష్టమని భావిస్తున్నపరిస్థితుల్లో ఏకంగా 127 ఏళ్ల వృద్ధురాలు కోలుకోవడం వెనుక ఆసుపత్రి సిబ్బంది కృషి ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎం.రాఘవేంద్రరావు తెలిపారు. ఆగస్టు 31న కన్నారపు వీర రాఘవమ్మ ఆసుపత్రిలో చేరారని, గురువారం డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు. కరోనా వస్తే భయపడాల్సిన అవసరం లేదని, అపోహలను పక్కనపెట్టి, ధైర్యంగా చికిత్స తీసుకుంటే ఎవరైనా వ్యాధిని జయించవచ్చని ఈ ఘటన నిరూపిస్తోందన్నారు. కలెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ జిల్లాలో రికవరీ రేటు పెంచేందుకు కృషి చేస్తున్నారని, వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

**నమ్మలేకపోతున్నాం:** కుటుంబ సభ్యులు కిర్లంపూడి మండలం జగపతినగరానికి చెందిన రాఘవమ్మ 1893లో జన్మించినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రిలో చేర్చినప్పుడు ఆమె కోలుకుంటారని అనుకోలేదని చెప్పారు. ఆ సమయంలో పరిస్థితి విషమంగా ఉందన్నారు. వృద్ధులకు కరోనా వస్తే కోలుకోవడం కష్టమని బయట అనుకోవడం విన్నానని..కానీ, ఆసుపత్రి వైద్యుల కృషితో ఈ రోజు ఆమె కోలుకొని చలాకీగా తిరుగుతున్నట్లు చెప్పారు. దీనికి ఆసుపత్రి సిబ్బందికి ధన్యవాదాలు చెబుతున్నట్లు చెప్పారు.




*రోటరీ క్లబ్ విశాఖపట్నం బి ఎన్ ఆర్ ఫౌండేషన్ కు శానిటైజర్ మిషన్ వితరణ*

*కంచరపాలెం ఊర్వశి జంక్షన్ లో ఉన్న బొట్టా నరసింగరావు పౌండేషన్ కు రోటరీ క్లబ్ విశాఖపట్నం పుల్లీ ఆటోమేటిక్ శానిటైజర్ మిషన్ను విరాళంగా అందించారు. ఈ మిషను సెన్సార్ ద్వారా పనిచేస్తుందని మధు బొర్రాడైరెక్టర్ వాటర్ కమిటీ మరియు మెషిన్ దాత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రెసిడెంట్ ఎం. శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. సెక్రటరీ మోదఅంబిక, కొల్లూరు రామరాజు, మధు బొర్రా,ఇ. సుబ్బారావు, కమ్యూనిటీ సర్వీసు, మెడికల్, చాంద్ కె కెకె, డైరెక్టర్, ఇంటర్నేషనల్ సర్వీస్ పాల్గొన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు రమాదేవి, శారద, పుష్పలత పాల్గొన్నారు. బి.ఎన్. ఆర్ ఫౌండేషన్ ట్రస్టీ బొట్టా ఈశ్వరమ్మ , సెక్రెటరీ బుజ్జి పాల్గొన్నారు. ఆరు నెలలుగా ఫౌండేషన్ తో కలిసి లాక్ డౌన్ పీరియడ్ లో నిత్యావసర సరుకులు పంపిణీ తోపాటు కుట్టు కేంద్రం శిక్షణ కేంద్రం, కంప్యూటర్ ట్రైనింగ్ సెంటరు కూడా రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. దానికి కొనసాగింపుగా ఇప్పుడు సానిటైజరు మిషన్ కూడా ఇవ్వడం ఎంతో అభినందనీయమని సభ్యులు పేర్కొన్నారు. ధన్యవాదాలు తెలియజేశారు.*

# ఐక్యపోరాటాలతోనే కార్మికహక్కుల సాధన

ఏడు రోడ్ల కూడలి వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల ప్రతినిధులు




శ్రీకాకుళం : ఐక్యపోరాటాలతోనే కార్మికుల హక్కులను సాధించుకోవడం సాధ్యమని, ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు సీహెచ్.గోవిందరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తూ 44 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్‌లుగా మారుస్తూ తీసుకువచ్చిన బిల్లుకు మంగళవారం లోక్‌సభలో ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడకపోతే ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.తిరుపతిరావు, ఎ.సత్యనారాయణ, ఏఐటీయూసీ నాయకులు ఎస్.నర్సింహులు, ప్రభావతి, ప్రసాదరావు, భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు, మెడికల్ రిప్రజెంటేటివ్‌ల యూనియన్ నాయకులు, మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 'పాలిసెట్' ను పకడ్బందీగా నిర్వహించాలి

## జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



విశాఖపట్నం : ఈ నెల 27వ తేదీన జరుగనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలీసెట్)- 2020 ను సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.వేణు గోపాలరెడ్డి తెలిపారు. గురువారం నాడు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహణపై సాంకేతిక విద్యా శాఖ, పోలీసు, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, జి.వి.ఎం.సి, పంచాయితీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా లో మొత్తం 56 పరీక్షా కేంద్రాలలో 15,755 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాయనున్నారని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, విద్యా శాఖల అధికారుల బృందాలు ప్రత్యేక ఫ్లయింగ్ స్కాడ్ గా పర్యవేక్షిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ విధించాలని, ఎగ్జామ్ మెటిరియల్ ను పరీక్షా కేంద్రాలకు తీసుకు వెళ్లడానికి ఎస్కార్డ్ ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను కోరారు.

వైద్యఆరోగ్య శాఖ పరీక్షా కేంద్రాల వద్ద వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని, కోవిడ్ నిబంధనలను పాటించాలని కోరారు. పరీక్షా కేంద్రాలను శానిటైజ్ చేయాలని, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని జి.వి.ఎం .సి, పంచాయితీ రాజ్ శాఖ అధికారులను కోరారు. పరీక్షా కేంద్రాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఈ పి డి సి ఎల్ అధికారులను కోరారు. సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా, తిరిగి వెళ్ళేందుకు గాను ఆదివారం నాడు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసి అధికారులను కోరారు.

# నాని భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

అమరావతి : రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఖండించింది. భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వెంటనే కొడాలి నానిని తన మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలంటూ రేపు అన్ని జిల్లాల కలెక్టరు కార్యాలయాలు, ఆర్డీఓ కార్యాలయాల వద్ద ఆందోళనకు పిలుపునిచ్చింది. భాజపాపై మంత్రి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పీవీఎన్ మాధవ్, విష్ణువర్ధన్ రెడ్డి విజయవాడలో మీడియాతో మాట్లాడారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ, వారిని రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తోన్న మంత్రి నానిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై సైతం నాని అనుచిత వ్యాఖ్యలు చేశారని, వాటిని తమ పార్టీ తీవ్రంగా ఆక్షేపిస్తోందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి అండ చూసుకునే మంత్రి నాని తన నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఇలా అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు. అధికార పార్టీలో పిచ్చోళ్లు ఎక్కవయ్యారని, తెలంగాణ సీఎం కేసీఆర్ సహకారంతో ఇలాంటి వాళ్లను ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్పించాలని కోరతామని వారు ఎద్దేవా చేశారు.

# 'నోబెల్' ప్రైజ్ మనీ పెరిగింది

స్వీడన్ : నోబెల్ బహుమతితో పాటు అందే నగదు బహుమతి ఈ ఏడాది పెరిగింది. ఈ సంవత్సరం 9 నుండి 10 మిలియన్ స్వీడిష్ క్రోనర్(1.1 మిలియన్ డాలర్లు)కు పెంచుతూ నోబెల్ ఫౌండేషన్ గురువారం నిర్ణయం వెలువరించింది. నోబెల్ ఫౌండేషన్ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి ఇటీవలి సంవత్సరాలలో చేసిన కృషి బహుమతి మొత్తాన్ని పెంచేందుకు వీలు కల్పించిందని ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సాహిత్యం, శాంతి, ఆర్థిక శాస్త్ర రంగాలలో ఈ ఏడాది బహుమతులు అక్టోబర్ 5 వారంలో ప్రకటించబడతాయి.

2012 ప్రారంభం నుండి పెట్టుబడి మూలధనం మూడు బిలియన్ల క్రోనర్ నుండి 4.6 బిలియన్లకు పెరిగింది.

మంచి మార్కెట్ పనితీరు, సొంత ఆస్తి నిర్వహణ నుండి మంచి ఫలితాలు దక్కాయి.

# ప్రజలను చైతన్యం చేసే సందేశాత్మక లఘు చిత్రాలు రూపొందించాలి

## - ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి



విశాఖ సిటీ : ప్రజలను చైతన్యం చేసే సందేశాత్మక లఘు చిత్రాలను రూపొందించాలని ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తన చాంబర్ లో ర్యాగింగ్ పై సనరా ఫీనిక్స్ మూవీస్ ఆధ్వర్యంలో రూపొందించిన " రెస్పెక్ట్ " షార్ట్ ఫిల్మ్ సిడి ని ఆయన రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మార్పుకోసం,ప్రజలను చైతన్య వంతం చేసే కథలతో మేకర్స్ మంచి లఘు చిత్రాలను చేయాలని చెప్పారు. దర్శకుడు సత్యాడ నరసింగరావు, నిర్మాత శరత్ చంద్ర ఇదే కోవలో మంచి కాన్సెప్ట్ తో 'రెస్పెక్ట్' అనే లఘు చిత్రాన్ని రూపొందించడం అభినందనీయం అన్నారు. ర్యాగింగ్ వలన ఇబ్బందులు పడుతున్న అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యుల ఆవేదనను ఈ లఘు చిత్రం ద్వారా చూపించారని పేర్కొన్నారు. ఈ టీమ్ భవిష్యత్ లో మరిన్ని మంచి చిత్రాలను చేయాలని అభిలాషించారు. జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్ట్ ల ఫోరమ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సనరా ఫీనిక్స్ మూవీస్ బ్యానర్ పై ఇప్పటి వరకు ఎన్నో మంచి ఫిల్మ్ లను తీసిన దర్శక,నిర్మాతలు మరో ప్రయత్నం లో ర్యాగింగ్ కాన్సెప్ట్ పై 'రెస్పెక్ట్' అనే ఫిల్మ్ చేయడం అభినందనీయం అన్నారు.

ఈ టీమ్ తీసిన ఫిల్మ్ లకు రాష్ట్ర స్థాయి అవార్డులు కూడా వచ్చాయని చెప్పారు. సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని లఘు చిత్రాలను రూపొందిస్తున్న దర్శకుడు సత్యాడ నరసింగరావు, నిర్మాత శరత్ చంద్ర భవిష్యత్ లో మరో మంచి కథతో సినిమా చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సత్యాడ నరసింగరావు, నిర్మాత శరత్ చంద్ర, అసోసియేట్ డైరెక్టర్ శశి, అసిస్టెంట్ డైరెక్టర్ పి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణోత్సవం ఆన్‌లైన్ టికెట్ల అక్టోబర్ కోటా విడుదల

తిరుమల: అక్టోబర్ నెలకు సంబంధించి శ్రీవారి ఆన్‌లైన్ కల్యాణోత్సవ టికెట్ల కోటాను టీటీడీ విడుదల చేసింది. అక్టోబర్ 16 నుంచి 24 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 25న శ్రీవారి పార్వేట ఉత్సవం ఉన్న కారణంగా ఆ తేదీల్లో కల్యాణోత్సవం లేదు.

ఆన్‌లైన్ కల్యాణోత్స వంలో పాల్గొనే గృహస్తులు(ఇద్దరు) టికెట్ బుక్ చేసుకున్న తేదీ నుండి 90 రోజుల్లోపు శ్రీవారిని దర్శించుకునే అవకాశాన్ని టీటీడీ కల్పించింది. తిరుమల శ్రీవారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం మరోసారి దర్శించు కున్నారు. సీఎం జగన్‌తో కలిసి కర్ణాటక సీఎం యడియూరప్ప స్వామివారిని దర్శించు కున్నారు.



# ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లిన కమల్‌హాసన్

చెన్నై: గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలియగానే, నటుడు, రాజకీయ నాయకుడు కమల్‌హాసన్ గురువారం సాయంత్రం ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లారు. కరోనా నుంచి కోలుకున్న ఎస్పీ బాలు ఆరోగ్య పరిస్థితి గత 24 గంటల్లో విషమించిందని ఎంజీఎం బులిటెన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎక్మోతో పాటు, ఆయనకు ప్రాణాధార వ్యవస్థ ద్వారా చికిత్స అందిస్తున్నామని ఎంజీఎం వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో కమల్‌హాసన్ ఆస్పత్రికి చేరుకున్నారు. బాలు ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులు, ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# డిసెంబర్ ఆఖరుకు స్పోర్ట్స్ ఎరీనా పూర్తి చేయండి

## - జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం : ఎం.వి.పి. కాలనీలో ఏ.ఎస్.రాజా గ్రౌండ్స్ లో నిర్మాణం లో ఉన్న స్మార్ట్ సిటీ పథకంతో నిర్మిస్తున్న ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా పనులు డిసెంబర్ నెలాఖరకు పూర్తి చేయాలని జి.వి.ఎం.సి. కమిషనర్, జి.వి.ఎస్.సి.సి.ఎల్ సి.ఇ.ఓ డా. జి. సృజన ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఫ్లోరింగుకు వినియోగిస్తున్న సింథటిక్ మరియు ఉడెన్ మెటీరియల్ నాణ్యతను పరిశీలించారు. నిర్మాణానికి సంబందించి గోడలు, స్లాబుకు వేస్తున్న సీలింగ్ మెటీరియల్ ను ఎంపిక చేసారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం ఉండాలని గుత్తేదారును ఆదేశించారు. తదుపరి ఆమె, 68వ వార్డులో 29 లక్షలతో నిర్మించబోతున్న రీటైనింగ్ వాల్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి గోడ నిర్మించుటకు అనుమతి మంజూరు చేసారు. 6వ జోన్ లో పట్టణ ప్రణాళికా విభాగపు అధికారుల ప్రతిపాదనలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్ కుమార్, శివప్రసాద్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ మరియు 6వ జోన్ పట్టణ ప్రణాళికా విభాగపు అధికారులు, ఏ.సి.పి. భాస్కరబాబు తదితరులు పాల్గొన్నారు.



## మానవ సేవే మాధవ సేవగా భావించి

# ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు



తాడేపల్లి: పోలీసు భద్రత నడుమ ఆలయాలను ధ్వంసం చేయించిన చంద్రబాబు నాయుడుకు హిందుత్వం గురించి మాట్లాడే అర్హత లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు విమర్శించారు. సంకీర్ణ ప్రభుత్వ హయాంలో విజయవాడలో గుళ్లను నాశనం చేసి, దేవుడి విగ్రహాలను మున్సిపాలిటీ చెత్తబండిలో వేసిన చరిత్ర ఆయనదని మండిపడ్డారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ముందుకు సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నిందలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతర్వేదిలో రథం దగ్ధమవడం, మరోచోట దేవుళ్ల విగ్రహాలు ధ్వంసం కావడం దురదృష్టకరమన్న అంబటి, ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. కానీ మతం ముసుగులో కొన్ని రాజకీయ పార్టీలు తమ ప్రభుత్వంపై బురదజల్లి లబ్ధి పొందాలని చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సజ్జల క్లారిటీ ఇచ్చారు..**

గురువారమిక్కడ విలేకరులతో మాట్లాడిన అంబటి రాంబాబు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్ట ప్రకారం, రాజ్యాంగబద్ధంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించటం పూర్వజన్మ సుకృతమని, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయమన్నారు. కానీ గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి కనిపిస్తోందని, అసమర్థ ప్రతిపక్షం సీఎం జగన్‌పై అసత్యాలు ప్రచారం చేస్తూ హిందూ వ్యతిరేకిగా ముద్ర వేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

ఇక గతంలో ఇద్దరు క్రిస్టియన్ ముఖ్యమంత్రులు తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించినపుడు లేని డిక్లరేషన్‌ను, ఇప్పుడు ఎందుకు తెరపైకి తీసుకు వచ్చారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుకు పోయేకాలం వచ్చిందని, ప్రతిపక్షం మాటలు ఎవరూ నమ్మవద్దని అంబటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, ప్రధాని గురించి ఎవరు ఇలా మాట్లాడినా తప్పేనని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారని తెలిపారు. అదే విధంగా సీఎం జగన్ ఢిల్లీ పర్యటనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా తీరుపై కూడా అంబటి మండిపడ్డారు. చంద్రబాబు తాబేదార్ల పత్రికలు పిచ్చి రాతలు రాస్తూ, ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అధికారంలో లేమనే బాధతోనే ఇదంతా..

## ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



అమరావతి : మతం పేరుతో టీడీపీ నీచ రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. అమరావతి భూ కుంభకోణంపై దృష్టి మరల్చడమే ఆ పార్టీ లక్ష్యమని ఆయన మండిపడ్డారు. గురువారం సజ్జల తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తమ రాజకీయ స్వార్థం కోసం టీడీపీ నేతలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. తమ అనుకూల మీడియా ద్వారా వార్తలు ప్రసారం చేసుకుంటున్నారని, కుట్రపూరితంగానే ఇలాంటి దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ దేవాలయాలపై దాడుల వెనుక ప్రధాన ప్రతిపక్షం ఉందని సజ్జల రామకృష్ణరెడ్డి ఆరోపించారు. హిందూ మతంపై విశ్వాసంతో కాదని, అధికారంలో లేమనే బాధతో ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. అత్యంత భక్తి భావంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారని తెలిపారు. సంక్షోభం సృష్టించాలన్న తాపత్రయమే ప్రతిపక్షాల్లో కనిపిస్తోందని, ఇలాంటి చర్యలతో ప్రజల్లో ప్రతిపక్షాలే చులకనవుతున్నాయని పేర్కొన్నారు. అసత్య ప్రచారాలు చేసిన వారే అభాసుపాలయ్యారన్నారు.

## గ్రేటర్‌లో ఆర్టీసీ బస్సులకు

# కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ : ఆర్టీసీ బస్సులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి గ్రేటర్‌లో బస్సులను నడిపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం అనంతరం బస్సులను తిప్పేందుకు అనుమతిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. లాక్‌డౌన్ మార్గదర్శకాలను పాటిస్తూ.. 25 శాతం సర్వీసులు నడపాలని నిర్ణయించారు. లాక్‌డౌన్ కారణంగా హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీ సేవలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఆరు నెలల తరువాత నగరంలో ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. దీనిపై మరికాసేపట్లో ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేయనుంది. అలాగే మార్చి ఉంచి నిలిచిపోయిన మహారాష్ట్ర, కర్ణాటక బస్సులు కూడా నడిపేందుకు సీఎం అంగీకారం తెలిపారు. ఈ మేరకు రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మరోవైపు ఏపీ సర్వీసులపై మాత్రం తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం.

# కరోనాతో అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ ఛైర్మన్ మృతి

న్యూఢిల్లీ: కరోనాతో ఇటీవల పలువురు ప్రముఖులు మృత్యువాత పడుతున్నారు. కేంద్రమంత్రి సురేష్ అంగడి బుధవారం కరోనాతో మృతి చెందగా ఆయన మరణ వార్త మరవక ముందే టాలీవుడ్ ప్రముఖ నటుడు కోసూరి వేణుగోపాల్ కరోనాతో మరణించారు. తాజాగా అటామిక్ ఎనర్జీ కమిషన్ మాజీ ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ శేఖర్ బసు(68) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం కరోనా బారినపడిన ఆయన కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించారు.

కరోనాతో పాటు కిడ్నీ సమస్యలతోనూ బాధపడుతున్న ఆయన ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఈ రోజు తెల్లవారుజామున 4.50 నిమిషాలకు తుదిశ్వాస విడిచారని అధికారులు తెలిపారు. మెకానికల్ ఇంజనీర్ అయిన డాక్టర్ బసు దేశంలో తొలి అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్ తయారీలో కీలకపాత్ర



పోషించారు. దేశంలో అణువిద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు కృషి చేశారు. 2015 అక్టోబర్ 23 నుంచి 2018 సెప్టెంబర్ 17 వరకు అటామిక్ ఎనర్జీ కమిషన్ ఛైర్మన్‌గా పనిచేశారు.

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ గానూ బాధ్యతలు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుంచి 2014లో పద్మశ్రీ పురస్కారం దక్కింది.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com